RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 210 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శుక్రవారం, ఫిబ్రవరి, 13, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 210 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Friday, February,13, 2026 | PAGES : 8 RS : 4 /- |




## రైతుల ప్రయోజనాలపై
# మోడీ అబద్దాలు

**వాణిజ్య ఒప్పందంపై పెద్ద ఎత్తున నిరసనలు**
**భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి12 : భారత్–అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్ని గ్రామాలలో పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని భారతీయ కిసాన్ యూనియన్ బికెయు ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మలను తగలబెడతామని తెలిపింది. బికెయు నేత రాకేశ్ తికాయత్ న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల పరిరక్షణ గురించి మోడీ ప్రభుత్వం అబద్దాలు చెబుతోందని విమర్శించారు. 1992లో భారత్ తన ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరిచి విదేశాలను అనుమతించిందని, ప్రస్తుత పరిస్థితికూడా అలాగే ఉన్నదని ఆయన చెప్పారు. 'భారత్–అమెరికా ఒప్పందం జరిగిన తీరు చూస్తుంటే అది మన దేశానికి ప్రమాదకారిగా కన్పిస్తోంది. కాబట్టి దానిపై మనం గళం విప్పాల్సిందే' అని అన్నారు. ఇది ఏకపక్ష ఒప్పందమని, ఒత్తిడితో కుదుర్చుకున్నదని తికాయత్ చెప్పారు.



## నాలుగేళ్ల మోడీ విదేశీ ఖర్చు
# రూ. 462.58కోట్లు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి12 : గత నాలుగేళ్లుగా అంటే 2021–2025ల మధ్య కాలంలో ప్రధాని మోడీ విదేశీ ప్రయాణాల కోసం అక్షరాలా రూ. 462.58కోట్లు ఖర్చు చేసింది. 2021–2025 మధ్య ప్రధాని మొత్తం 43 దేశాలను పలుమార్లు సందర్శించారు. వీటిలో అత్యధికంగా ఖర్చు చేసింది అమెరికా పర్యటనలకే. మొత్తం వ్యయంలో 16శాతం (74.4కోట్లు) నాలుగుసార్లు అమెరికా సందర్శనలకు ఖర్చు చేశారు. వ్యయం పరంగా జపాన్, ఫ్రాన్స్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జపాన్, ఫ్రాన్స్‌ల కోసం మొత్తం వ్యయంలో సుమారు 9శాతం ఖర్చు చేశారు.



## ఎన్ని కార్పోరేషన్‌లు అయినా ఎగిరేది
# గులాబీ జెండాయే

### శేరిలింగంపల్లి నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్ కార్పొరేషన్‌ను ఎన్ని కార్పొరేషన్లు చేసినా ఎగిరేది మాత్రం ఖచ్చితంగా గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం బీఆర్ ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమం లోకేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యేలు పోయినా.. పార్టీ వెన్నెముక కార్యకర్తలేన న్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా, కార్యకర్తలు మాత్రం చెక్కుచెదరకుండా కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. మొత్తం హైదరాబాద్‌లోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచింది. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వెళ్లినా, బంగారం వంటి కొత్త నాయకులు వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్నారు. శేరిలింగం పల్లిలోని 24డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా మనకుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోకాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతుల వైకుంఠం చూపి అధికారం దక్కించుకుం దని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు బీజేపీ 12 ఏళ్లుగా తెలంగాణకు 12 పైసల పని కూడా చేయలేదని, అది 'పూజకు పనికిరాని పువ్వు' అని ఎద్దేవా చేశారు. 'వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలి' అన్న నానుడినిగుర్తు చేస్తూ,తెలం గాణకుకేసీఆర్ నాయక త్వమే శ్రీరామరక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు. నగరంలో శాంతిభద్ర తలు అదుపు తప్పాయని కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.



## మామునూరు ఎయిర్‌పోర్టు పనులు
# ప్రారంభించండి

### – తెలంగాణ ఎయిర్‌పోర్టులకు అనుమతులు ఇవ్వండి
### – కేంద్రమంత్రి రామ్మోహన్‌కు సిఎం రేవంత్ వినతి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి12 : వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు పనులు త్వరగా ప్రారంభించాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. రాష్ట్రంలో నాలుగు కొత్త ఎయిర్‌పోర్టుల అభివృద్ధి కోసం అవసరమైన అనుమతులు, సహాయం కోరారు. భేటీలో మామూనూరు , కొత్తగూడెం, అంత ర్గాం, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చాయి. మామూనూరు విమానాశ్రయానికి భూసేకరణ పూర్తి కావడంతో, అవసరమైన నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వినతి చేశారు. అలాగే, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్ కోసం పాల్వంచలో స్థలం గుర్తించినందున, ఆబ్‌స్టక్షన్ లిమిట్ సర్వే, ఫీజిబిలిటీ స్టడీలు త్వరగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అంతర్గాం ఎయిర్‌పోర్ట్ కోసం ప్రత్యామ్నాయ స్థలం గుర్తించినట్లు తెలిపిన సీఎం.. వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రిని కోరారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ విషయంలో అదనంగా 249.82 ఎకరాల భూమి కేంద్ర ప్రభుత్వానికి సిద్ధంగా ఉందని సీఎం తెలియజేశారు. ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని ఒక సంవత్సరంలో పూర్తి చేసి, ఎయిర్‌బస్ సర్వీసులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సిఎం వెంట ఎంపిలు కడియం కావ్య, మల్లు రవి తదితరులు ఉన్నారు.**



# పంచాయితీలకు మరో రూ.387 కోట్లు విడుదల

### - ఫలించిన మంత్రి సీతక్క వినతి

హైదరాబాద్,ఫిబ్రవరి12 :గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ.387 కోట్లని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. మొదటి విడతగా ఇప్పటికే రూ. 259.36 కోట్లు విడుదలైన విషయం తెలిసిందే.

తాజా విడతతో కలిపి మొత్తం నిధులు రూ. 646.36 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణకు 15వ ఆర్థిక సంఘం కింద సుమారు రూ. 3,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తి చేసి, కేంద్రం కోరిన సమాచారాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ సమర్పించింది. ఇందుకు అనుగుణంగా విడతలవారీగా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇంకా సుమారు రూ. 2,400 కోట్లు విడుదల కావాల్సి ఉంది.



# కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో రేవంత్ భేటీ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి12 :** మూసీ పునరుద్దరణలో భాగంగా హైదరాబాద్‌లో నిర్మించబోతున్న గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు హాజరు కావాలని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సిఎం రేవంత్ రెడ్డి కోరారు.అలాగే ఈ ప్రాజెక్టుకు అవసరమైన రక్షణ భూములను బదలాయించాలని వేడుకున్నారు. ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. గురువారం ఉదయం దేశ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు.




## సెంటిమెంట్ అస్త్రంగా
# మార్చుకున్న బీఆర్ఎస్

**నిజామాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో జిల్లాల పునర్విభజనపై వేస్తామని ప్రకటించిన జుడీషియల్ కమిషన్ ప్రకటన అధికార పక్షానికి ఒక రకంగా సెల్ఫ్ గోల్‌గా మారింది. అశాస్త్రీయంగా ఏర్పడిన జిల్లాలను రేషనలైజేషన్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినప్పుడే, విపక్షాలకు ఒక బలమైన రాజకీయ అస్త్రం దొరికింది. ముఖ్యంగా భూపాలపల్లి వంటి జిల్లాల రద్దుపై బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నా, ప్రభుత్వం చాలా కాలం పాటు మౌనం వహించడం వ్యూహాత్మక తప్పిదంగా మారింది. రద్దు ఉండదని ఇప్పుడు ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటిస్తున్నప్పటికీ, అప్పటికే జరగాల్సిన రాజకీయ నష్టం జరిగిందన్నది విశ్లేషకుల అభిప్రాయం.జిల్లాలను మార్పు చేసేందుకు కమిటీ వేస్తామని ప్రభుత్వం ప్రకటించిన వెంటనే, బీఆర్ఎస్ దీన్ని ఒక సెంటిమెంట్ అస్త్రంగా మలుచుకుంది. మేము తెచ్చిన జిల్లాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తోంది అంటూ ప్రజల్లో భావోద్వేగాల రాజకీయం చేయడంలో గులాబీ దళం సఫలమైంది. భూపాలపల్లి వంటి సున్నితమైన ప్రాంతాల్లో ఈ ప్రచారం క్షేత్రస్థాయిలో బలంగా చొచ్చుకుపోయింది. ప్రజల్లో సెంటిమెంట్ గూడుకట్టుకున్న తర్వాత ఇప్పుడు జిల్లాల రద్దు ఉండదు అని ప్రకటించడం, "నష్టం జరిగిన తర్వాత మేల్కొనడం లాంటిదేనని భావిస్తున్నారు. అసలు ఉనికిలో లేని సికింద్రాబాద్ జిల్లా గురించి కూడా ప్రచారం జరిగిందంటే, ప్రభుత్వం తన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఎంతటి వైఫల్యాన్ని మూటగట్టుకుందో అర్థమవుతోందన్న నిరాశ కాంగ్రెస్ క్యాడర్‌లో కనిపిస్తోంది.అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి గతంలో జిల్లాల ఏర్పాటు అశాస్త్రీయంగా జరిగిందని, దానిపై అధ్యయనం అవసరమని పేర్కొన్నారు. ఈ అస్పష్టతే విపక్షాలకు వరంగా మారింది.



## మూసీ భూసేకరణ ప్రక్రియ
# ప్రారంభం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** మూసీ నదిని ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా కీలక ప్రాజెక్టు చేపడుతున్న తెలం గాణ సర్కార్.. దానికి సంబంధించి కీలక చర్యలు చేపట్టింది. ఈ ప్రాజె క్టులో అతి ముఖ్యమైన భూసేకరణ ప్రక్రియనుప్రారంభించింది. 50 ఎకరాల భూమిని సేకరించేందుకు చర్యలు చేపట్టింది. భూ సేకరణకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసిన సర్కార్.. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని పేర్కొంది. మార్కె ట్ విలువ ఆధారంగా పరి హారం ఇవ్వనున్నట్లు తెలిపింది. మూసీ సుం దరీకరణ కోసం కం కణం కట్టుకున్న రేవంత్ రెడ్డి సర్కా ర్.. ఆ దిశగా కీలక ముందడుగు వేసింది. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు సంబంధించి కీలక అప్‌డేట్‌ను అధికారులు వెల్లడిం చారు. మూసీ ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియను మొదలు పెట్టింది. ఈ నేపథ్యంలోనే మూసీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు భూసేకరణ కోసం.. మూసీ రివర్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆ ర్‌డీసీఎల్) కీలక ప్రకటన చేసింది. మూసీపరివా హక ప్రాంతాల్లో ఉన్న వారు ఏవైనా అభ్యంతరాలు ఉంటే..నిర్ణీత గడు వులో తమదృష్టికి తీసుకురావాలని పేర్కొన్నా రు. ఫేజ్1 కింద.. హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు మొత్తం 9.2 కిలోమీటర్ల మేర భూ సేకరణ చేయనున్నారు.

# జర్నలిస్టులకు 44 వేలకు పైగా అక్రిడిటేషన్ కార్డులు

**- ప్రక్రియ మరింత పారదర్శకంగా?**
**?అర్హులందరికీ న్యాయం**
**- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, ఫిబ్రవరి 12, (తెలంగాణ దిశ) :** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తుందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్ఓ జి. మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా ప్రభుత్వ ఉత్తర్వులు 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి ప్రభుత్వ ఉత్తర్వులు 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు.

2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, అదే విధంగా 20 న్యూస్ ఏజన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు. అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200, డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర, జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ, మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగవ స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

## ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డికి అభినందనల వెల్లువ



**తార్నాక, ఫిబ్రవరి 12, (తెలంగాణ దిశ) :** మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హృదయపూర్వక అభినం దనలు తెలిపారు. గురువా రం ఆయన కార్యా లయం లో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినయ్ కుమార్ రెడ్డి సమర్థవంతమైన నాయకత్వంలో ఎంఎంసి పరిధిలో పరిపాలన మరింత ప్రభావవంతంగా సాగుతూ ప్రజల సంక్షేమానికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. తన నూతన బాధ్యతల్లో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాను పెడధోరణులకు వాడుకోవద్దు

**- ఎమ్మెల్యే వివేకానంద- ట్రస్మా ఆధ్వర్యంలో పదవతరగతి విద్యార్థులకు కేరీర్ గైడెన్స్**
**- విద్యార్థులకు స్ఫూర్తి నిచ్చిన మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ మాజీ డైరెక్టర్ బాలలత జీవితపాఠం**





**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 12, (తెలంగాణ దిశ) :** స్ఫూర్తిదాయకమైన వ్యక్తుల జీవితాల కోసం తెలుసుకునేందుకు సోషల్ మీడియాను సద్వినియోగ చేసుకోవాలని విద్యార్థులకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కెపి వివేకానంద సూచించారు. అఫర్డబుల్ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం (ట్రస్మా) కుత్బుల్లాపూర్ కమిటీ ఆధ్వర్యంలో పదవతరగతి విద్యార్థులకు కేరీర్ గైడెన్స్, మోటివేషనల్ తరగతిని గాజులరామారంలోని పద్మావతి గార్డెన్స్‌లో గురువారం జరిగింది. కార్యక్రమానికి ప్రముఖ కేరీర్ గైయిడ్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ మాజీ డైరెక్టర్ బాలలత మల్లవరపుతో కలిసి ఎమ్మెల్యే వివేకానంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతకు మాజీ ఐఏఎస్ అధికారిణి బాలలత స్ఫూర్తిదాయకమన్నారు. కృషి, పట్టుదలతో తాను రెండు సార్లు సివిల్స్ సాధించడం గొప్పవిషయమని తెలిపారు. సోషల్ మీడియాలో అనవసరమైన వాటికి కేటాయించే సమయాన్ని బాలలత లాంటి గొప్ప వ్యక్తులు ఇచ్చే సలహాలు, సూచనలను చూడాలని, వినాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ మాజీ డైరెక్టర్ బాలలత మల్లవరపు మాట్లాడుతూ యువత ఉద్యోగులు కాకుండా ఉద్యోగాలను సృష్టించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని విద్యార్థులను కోరారు. తాను చిన్నప్పుడే పోలియోకు గురైనప్పటికీ తన లక్ష్యం కోసం అహర్నిశలు శ్రమించానని తన జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లను విద్యార్థులకు వివరించారు. మనదేశం వందేళ్ళుగా అభివృద్ధి చెందుతున్న దేశంగానే చెప్పుకుంటున్నామని అన్నారు. అభివృద్ధి చెందిన దేశం ఎప్పుడవుతుందని ప్రశ్నించారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశం అని చెప్పుకోవాలంటే అది యువత చేతుల్లోనే ఉందనన్నారు. అందుకోసం యువతను తన వంతుగా సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. ఉన్నత లక్ష్యయాలతో యువత ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. పదవ తరగతి భవిష్యత్తుకు మొదటి మెట్టుగా భావించి అత్యుత్తమ ఫలితాలను సాధించాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారిణి జమినికుమారి, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె. రామేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిర్రు ఆంజనేయులు, జిల్లా నాయకులు గడ్డమీది బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, వీరన్న, శ్యాం, ట్రపసా గ్రేటర్ కుత్బుల్లాపూర్ చైర్మెన్ కోలా వెంకటేశ్ ముదిరాజ్, అధ్యక్షుడు వినోద్ జాదవ్, ప్రధాన కార్యదర్శి జనార్ధన్ దయాకర్, కోశాధికారి శ్రీశైలం, సీనియర్ కరస్పాండెంట్స్ బలరాం యాదవ్, నర్సింహులుగౌడ్, ప్రవీణ్‌రెడ్డి, మధుకుమార్, భూపాల్‌రెడ్డి, విద్యాసంస్థల ప్రతినిధులు అజయ్ విక్రం, గిరిబాబు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కీసర గుట్ట బ్రహ్మోత్సవాల జాతరకు తైబజార్ వేలం పూర్తి


**- రూ.4,00,030లతో బోడ నరేష్‌కు మొదటి పాట**



**కీసర,ఫిబ్రవరి 12, (తెలంగాణ దిశ) :** మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని కీసర సర్కిల్ పరిధిలోని కీసర గుట్టపై వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల జాతర సందర్భంగా ఏర్పాటు చేయనున్న తాత్కాలిక దుకాణాల కోసం తై బజార్ వేలం నిర్వహించారు. ఈ వేలం ప్రక్రియను కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 13 నుంచి 18 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో కీసర గుట్ట వద్ద ఏర్పాటు చేసే దుకాణాల కోసం ఈ వేలం నిర్వహించగా, మొత్తం ఇద్దరు వ్యాపారులు పాల్గొన్నారు. వేలం పాటలో బోడ నరేష్ రూ. 4,00,030లతో మొదటి స్థానంలో నిలిచి తై బజార్ హక్కును దక్కించుకున్నారు. కాగా డి. రాము రూ. 3,99,530లతో రెండవ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత, ఎస్ డబ్ల్యూ ఎం డీఈఈ టి. సంతోష్ కుమార్, ఏఎంసీ గంగన్న, ఏఎంసీ వెంకటేష్, ఏఎంసీ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**- కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్**





**మల్లాపూర్, ఫిబ్రవరి 12, (తెలంగాణ దిశ) :** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పటాన్ బస్తీ గత పదేళ్లుగా అభివృద్ధికి దూరంగా మిగిలిపోయిన ప్రాంతంగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడం, తాగునీటి సౌకర్యం లేకపోవడం, ప్రాథమిక వసతుల కొరతతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గమనించిన కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ బస్తీబాట పర్యటన సందర్భంగా పటాన్ బస్తీ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. బస్తీ వాసులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే స్పందించిన నెమలి అనిల్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి సమన్వయంతో సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభించారు. డ్రైనేజీ సమస్య పరిష్కారం, తాగునీటి సరఫరా మెరుగుదల, మౌలిక వసతుల కల్పన దిశగా ఇప్పటికే పనులు మొదలయ్యాయి. ఈ కృషికి గుర్తింపుగా పటాన్ బస్తీ వాసులు గురువారం నెమలి అనిల్ కుమార్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. తమ సమస్యలు పరిష్కారం అవుతున్నందుకు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూప్రజల సమస్యలే నా రాజకీయ అజెండా అని అన్నారు. బస్తీల అభివృద్ధే నా లక్ష్యమని, ప్రజల కోసం నా పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బస్తీ ప్రజల కష్టాలను అర్థం చేసుకుని, వాటి పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తున్న నెమలి అనిల్ కుమార్ కృషికి పటాన్ బస్తీ ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్, సురేష్ గౌడ్,మహిళా నాయకురాళ్లు ఇష్రాత్ బానో, ఇంతియాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

## కాప్రాలో ఘనంగా మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ రాజిరెడ్డి జయంతి వేడుకలు


**కాప్రా, ఫిబ్రవరి 12, (తెలంగాణ దిశ) :** బిఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ ఆధ్వర్యంలో కాప్రా తహసిల్దార్ కార్యాలయం వద్దదివంగత నేత, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బండారి రాజిరెడ్డి 79వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షులు బైరి నవీన్ గౌడ్ మాట్లాడుతూ రాజిరెడ్డి ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేసిన మహానేత అని కొనియాడారు. ఆయన చూపిన సేవా మార్గంలో నడుస్తూ ప్రజలకు అంకితభావంతో సేవ చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నాగవరం ఉన్నత పాఠశాలలో స్పేస్ టెక్నాలజీపై అవగాహన సెమినార్



**నాగవరం, ఫిబ్రవరి 12, (తెలంగాణ దిశ) :** నాగవరం ఉన్నత పాఠశాలలో "ఎంఫసిస్ ఆన్ స్పేస్ టెక్నాలజీ" అంశంపై అవగాహన సెమినార్‌ను గురువారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిసి. రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త రఘునాథ మీనన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘునాథ మీనన్ మాట్లాడుతూ ఉప గ్రహ సాంకేతికతను సామాజిక అవసరాలకు ఎలా వినియోగిస్తున్నామో విద్యార్థులకు వివరించారు. రోజువారీ జీవితంలో ఉపయోగించే గూగుల్ మ్యాప్స్, రిమోట్ సెన్సింగ్, ఓలా--ఉబర్ బుకింగ్ వంటి సేవలు కృత్రిమ ఉపగ్రహాల ఆధారంగానే పనిచేస్తున్నాయని తెలిపారు. అలాగే దేశం నుంచి ప్రయోగించిన చంద్రయాన్ వంటి అత్యుత్తమ రాకెట్‌ల ద్వారా చంద్రుడిపై కీలక సమాచారాన్ని సేకరించగలిగామని వివరించారు. స్పేస్ టెక్నాలజీకి సంబంధించిన అనేక ఆసక్తికర విషయాలను విద్యార్థులు శ్రద్ధగా విని ప్రశ్నలు అడిగారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు వనజ, రాజ్యలక్ష్మి, అరవింద్ కుమార్, శ్రీదేవి, సుమతి, మాలోత్ నాయక్, వందన, వరమ్మ, సంధ్యారాణి, కమల, సుప్రజ, సంజయ్ రాణి, అర్చన, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



# సంపాదకీయం


## ఇండోర్ ఘటన కనువిప్పుకావాలి

ఏమాత్రం ఆలోచన ఉన్నవారైనా సరే, మంచినీళ్ల పైప్‌లైన్ మీద మరుగుదొడ్డి కడతారా? ఇంటింటికీ సరఫరా అయ్యే నీటిలో మురుగు నీరు వచ్చిన కలుస్తుంటే అధికారులు ఏం చేస్తున్నట్లు? అలా కట్టిన మరుగుదొడ్డి గుంత నుంచి పెల్లుబికిన వ్యర్థ జలాలు, ఆ టాయిలెట్ కింద నుంచి వెళు న్న ప్రధాన తాగునీటి పైప్‌లైన్‌లో కలవడంతో ఇండోర్‌లో విషాదాన్ని మిగిల్చింది.జీవితాన్ని సంతోషంగా గడపాలంటే ముందు ఆరోగ్యం బాగుం డాలి. ఊరికే జబ్బు పడకూడదంటే జనావాసాల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా ఉండడంతో పాటు ప్రతిఒక్కరూ సురక్షితమైన తాగునీటికి నోచుకోవాలి. ఈ రెండు కరువైన చోట రోగాలు విజృంభించి అకా ల మరణాలకు మూలమవుతాయి. మన దేశంలో చాలా మందికి కనీసం మంచినీరు అందించలేని పరిస్థితుల్లో చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఉండడం ఆలోచించాల్సిన విషయం. ఒక పక్క భారత్ త్వరలో ప్రపంచంలోనే అతిపెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుంది అని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ సరైన తాగునీటి కోసం కొట్లాడుతున్న పరిస్థితి కానీ, తాగునీటికి సరైన వసతి లేని గ్రామాలు, పట్టణా లు ఇప్పటికీ దేశంలో చాలానే ఉన్నాయి. దేశంలో దాదాపు ప్రతీ ఏటా 37.7 మిలియన్ల మంది నీటి సంబంధించిన వ్యాధు లతో కాలగర్భంలో కలిసిపోతున్నట్లు తెలుస్తోంది. సగటున దేశంలో రోజూ 585 మంది కలుషిత నీరు తాగడం వలన, నీటి సంబంధించిన వ్యాధులతో మరణిస్తున్నారు అని పలు నివేదికలు పేర్కొంటు న్నాయి.ఇటీవల కాలంలో మహారాష్ట్ర, కర్ణాటక, కేరళలో వరుసగా కలుషిత నీటి ఉదంతాలు చోటుచేసుకోగా తాజాగా స్వచ్ఛ నగరంగా పేరు పొందిన ఇండోర్‌లోని భగీరథ్‌పుర ప్రాంతంలో కలుషిత నీరు తాగడం వల్ల సుమారు 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ప్రజల ప్రాణాలకు కలుషిత వ్యర్థాలతో ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా చూసే బాధ్యత ప్రభుత్వాలేదనని గుర్తు చేస్తూ ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభ 2010లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన పరిసరాలను మానవ హక్కుల్లో అంతర్భాగంగా గుర్తించింది. కానీ నిర్లక్ష్యంలో తేలియాడుతున్న అధికార యంత్రాంగం కారణంగా వ్యక్తిగత, గృహావసరాలకు తగినంత మంచినీటిని నిరం తరం పొందే హక్కు జన భారతానికి ఉన్నా లేనట్లుగానే అనిపిస్తున్నది. వరుసగా ఎనిమిదేళ్లపాటు దేశంలోనే శుభ్రమైన నగరంగా పురస్కారాలు పొందిన ఇండోర్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే.. చెత్త, మురుగునీటికి ఆవాసాలుగా పేరు పడ్డ హైదరాబాద్, విజయవాడ, వైజాగ్, తిరుపతి, తదితర నగరాల పరిస్థితి ఏమిటనేది ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది.ఏటా 3.77 కోట్ల మంది భారతీయులు కలుషిత నీళ్లలో నుంచి పురుడు పోసుకునే జబ్బుల బారినపడుతున్నారు. 15 లక్షల మంది పిల్లలు డయేరియాతో చనిపోతున్నారు. జల కాలుష్యంతో ప్రజల అనారోగ్యం దెబ్బతింటుండడంతో దేశం ఏడాదికి 7.3 కోట్ల పనిదినాలను నష్టపోతుంది. దానివల్ల భారత్‌కు సంవత్సరానికి 60 కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం సంభవిస్తోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ నేటికీ అందరికీ కనీసం విద్య, వైద్యం అందుబాటులో లేదు. అక్షరాస్యత అంతంత మాత్రంగానే ఉంది. ఇక మహిళల్లో బహు తక్కువ అక్షరాస్యత ఉన్న మాట వాస్తవం.దేశంలో చాలా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ 'లిక్కర్ కిక్' పైనే ఆధారపడి ఉండడం చాలా దురదృష్టకరమైన విషయం. ఏ ప్రభుత్వాలైన ఆ రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని కోరుకోవాలి. కానీ మన ప్రభుత్వాలు ముఖ్యంగా పండగ వేళల్లో, ప్రత్యేక రోజుల్లో మద్యం ఎక్కువగా ఉత్పత్తి చేయడంతో పాటు ఆ మద్యాన్ని బాగా సేవించి, ప్రభుత్వాలకు ఆదాయం పెరగడానికి వీలుగా టైం పొడిగింపు ద్వారా ఎక్కువ మంది తాగుబోతులును తయారు చేసే ప్రయత్నం జరుగుతున్నది. తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలి. దేశం అభివృద్ధి, ఔన్నత్యం ఆ దేశ ప్రజల నైపుణ్యాలపైన ఆధారపడి ఉంటుంది.. ఉత్పత్తి రంగంలో, సేవా రం గాల్లో ప్రజలు పాలుపంచుకోవడం ద్వారా దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుంది... మన పాలకులు కలలు కంటున్న వికసిత్ భారత్ సాధ్యం కావాలంటే, ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలు తీర్చుకోవడానికి అవసరమైన విద్యను అందించాలి.. వైద్య రంగా న్ని బలోపేతం చేయడానికి సన్నాహాలుచేయాలి. ఉద్యోగ ఉపాధిఅవకాశాలు కల్పించాలి. వలసలుతగ్గించాలి.. ఓటు బ్యాంకు రాజకీయాలు మానాలి. ఎప్పుడూ ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత, సంక్షేమ పథకాలుపై ఆధారపడి బతికే జీవితాల నుంచి బయట పడేందుకు చర్యలు చేపట్టాలి. ఆ విధంగా ప్రభుత్వాలు ప్రజల జీవన స్థాయి మెరుగు పరిచే ఆశయాలను రూపొందించుకుని, ప్రతీ నూతన సంవత్సరం నూతన విధానాలు ద్వారా ప్రజల తలసరి ఆదాయం పెరగడానికి కొత్త కొత్త ప్రాజెక్టులు రూపొందించి వాటిని అమలు చేయాలి. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టే కలుషిత వ్యర్థాలకు చెక్ పెట్టే ప్రయత్నం జరగాలి. అదే సమ యంలో ప్రజలు కూడా ప్రభుత్వాలు ఎలా పనిచేస్తున్నాయో,ఏ లక్ష్యం కోసం తహతహలాడుతున్నారో అర్థం చేసుకోవాలి. ప్రఖ్యాత రష్యా నాయకుడు లెనిన్ చెప్పినట్లు 'పాలకుల వ్యూహాలు గ్రహించలేనంత వరకు ప్రజలు మోసపోతూనే ఉంటారు' అనే విషయం ఇకనైనా మన ప్రజలు అర్థం చేసుకోవాలి. ప్రజలను రకరకాల కార్యక్రమాలు ద్వారా మభ్యపెడుతున్న ప్రభుత్వాలకు తగిన రీతి లో ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలి. నేటి పాలకులకు, ప్రభుత్వాలకు తగిన రీతిలో ప్రజలు గుణపాఠం నేర్పడమే మన గురుతర బాధ్యత అని ప్రజలు, జెన్ జెడ్ యువ త గ్రహించాలి.

# పొగరాయుళ్లకు బ్లాక్ మార్కెట్ దెబ్బ

### - మార్కెట్ లోకి రాని సిగరెట్లు
### - 30 నుంచి 40 శాతం పెరిగిన అనధికార ధరలు

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 12, (తెలంగాణ దిశ) :**కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం సిగరెట్ల ధరల పెంపుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మార్కెట్లో అనధికారికంగా భారీగా రేట్లు పెరిగాయి. ధరల పెంపు ఎంత అన్నది స్పష్టంగా ప్రకటించక పోవడాన్ని అవకాశంగా తీసుకున్న కొందరు వ్యాపారులు సిగరెట్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించి 30 నుంచి 40 శాతం వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2014లో పెద్ద గోల్డ్ ఫ్లాక్ సిగరెట్ ఒక్కటి రిటైల్ ధర రూ.9గా ఉండగా, ప్రస్తుతం అది రూ.22 వరకు చేరింది. ధరల భారం వ్యసనపరులపై మోపుతూ కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వసూలు చేస్తోందని ధూమపాన ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐటీసీ కంపెనీకి చెందిన గోల్డ్ ఫ్లాక్ సిగరెట్ల 10 పీసుల ప్యాకెట్ గత నెలలో హోల్‌సేల్ ధర రూ.160గా ఉండగా, రిటైల్‌లో రూ.180--190లకు విక్రయించేవారు. ప్రస్తుతం అదే ప్యాకెట్‌ను రూ.170 నుంచి రూ.200 వరకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొందని రిటైల్ వ్యాపారులు వాపోతున్నారు. ఇంతకుముందు ఐటీసీ గోడౌన్‌ల నుంచి సేల్స్‌మెన్లు సైకిళ్లపై సిగరెట్లను ప్రధాన పాన్ షాపులకు సరఫరా చేసేవారు. అయితే ధరల పెంపు ప్రకటనల నేపథ్యంలో ఇటీవల సేల్స్‌మెన్ల ద్వారా సరఫరా నిలిపివేసినట్లు వ్యాపారులు చెబుతున్నారు.



గండి మైసమ్మ చౌరస్తా ప్రాంతంలో గత 30 ఏళ్లుగా పాన్ షాపులు నిర్వహిస్తున్న యజమానులకు కూడా గత 15 రోజులుగా సిగరెట్ల సరఫరా నిలిచిపోయిందని, మేడ్చల్ గోడౌన్‌కు వెళ్లినా 'స్టాక్ లేదు' అంటూ బుకాయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఐటీసీ కంపెనీ నుంచి గోడౌన్‌లకు, అక్కడి నుంచి రిటైలర్లకు రావాల్సిన సిగరెట్ల ప్యాకెట్లు గోడౌన్ సిబ్బంది, సేల్స్ సిబ్బంది కలిసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో ప్రధాన సెంటర్లలో పాన్ షాపు నిర్వాహకులు బ్లాక్‌లో సిగరెట్లు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ సిగరెట్లపై పాత ఎమ్మార్పీ ధరలే ముద్రించి ఉండగా, మార్కెట్లో మాత్రం సుమారు 40 శాతం అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. కింగ్స్ (పెద్ద గోల్డ్ ఫ్లాక్), క్లాసిక్, కనెక్ట్, గోల్డ్ ఫ్లాక్ సిల్క్, అమెరికన్, చిన్న గోల్డ్ ఫ్లాక్ వంటి ప్రధాన బ్రాండ్ల ధరలు ఒక్కసారిగా పెరగడంతో ధూమపాన ప్రియులకు షాక్ తగిలింది. నగరంలో ఒక్కో ఐటీసీ గోడౌన్ రెండు రోజులకు సుమారు రూ.30 నుంచి రూ.40 లక్షల వ్యాపారం నిర్వహిస్తుందని అంచనా. అయితే ఇటీవల సిగరెట్లను లాట్ల లాట్లుగా బ్లాక్ మార్కెట్‌కు తరలించి లక్షలాది రూపాయలు దొడ్డిదారిన సంపాదిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై మూడు రోజుల క్రితం మేడ్చల్ ఐటీసీ గోడౌన్‌లో రిటైలర్లు--సిబ్బందికి మధ్య వాగ్వాదం జరగగా, విషయం ఐటీసీ ప్రధాన కార్యాలయం వరకు చేరినట్లు సమాచారం. ప్రభుత్వ విభాగాల అధికారులు ఈ బ్లాక్ మార్కెట్‌పై మౌనం పాటిస్తున్నారని, ఫలితంగా మార్కెట్లో లభించాల్సిన సిగరెట్లు నల్లబజార్ నుంచి కొనాల్సి వస్తోందని పాన్ షాపు యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మార్పీ పాతదే ఉన్నప్పటికీ కొత్తగా పెంచిన ధరలతో విక్రయించాల్సి రావడంతో ప్రతి వినియోగదారుడికి వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా సిగరెట్లపై జీఎస్టీ రూపంలో కోట్లాది ఆదాయం పొందుతున్నప్పటికీ, బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకోవడంలో విఫలమవుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని ఎమ్మార్పీ ధరలకే సిగరెట్ల విక్రయాలు జరిగేలా చూడాలని పాన్ షాపు నిర్వాహకులు, ధూమపాన ప్రియులు డిమాండ్ చేస్తున్నారు.

# నిజాంపేట్ సర్కిల్ లో సార్వత్రిక సమ్మె విజయవంతం

### - ప్రగతి నగర్ లో ర్యాలీ




**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 12, (తెలంగాణ దిశ) :**దేశవ్యాప్త సర్వత్రిక సమ్మె పురస్కరించుకొని గురువారం నిజాంపేట్ సర్కిల్ పరిధిలో సమ్మె విజయవంతంగా ముగిసింది. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే విధంగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మె నిర్వహించారు. సమ్మెలో సిఐటియు రాష్ట్ర నాయకులు పి. సత్యం, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల బిందెల శ్రీనివాస్, ఐఎన్ టియుసి బాచుపల్లి మండల అధ్యక్షుడు ఆదిరెడ్డి తదితర ప్రముఖులు సమ్మె లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రగతి నగర్ సుందరయ్య భవన్ వద్ద నుండి మోర్ సూపర్ మార్కెట్, బతుకమ్మ కుంట మీదుగా కోతుల బొమ్మ సెంటర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వందలాది మంది కార్మికులు వివిధ రంగాల ఉద్యోగులు పాల్గొన్నారు. భారీ ర్యాలీ ముగింపు సందర్భంగా సిఐటియు బాచుపల్లి మండల కార్యదర్శి రాథోడ్ సంతోష్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి సీఐటీయూ రాష్ట్ర నాయకులు పి. సత్యం, ఏఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందుల శ్రీనివాస్, ఐఎన్ టియూసీ బాచుపల్లి మండలాధ్యక్షుడు ఆదిరెడ్డి, టాప్ రా బాచుపల్లి మండల అధ్యక్షుడు వెంకట్రాజ్యం, సిఐటియు జిల్లా నాయకులు వెంకటరామయ్య, ఏఐటిసి బాచుపల్లి మండల నాయకులు దస్తగిరి లు ప్రసంగించారు. గత 11 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తూ కార్మికులకు వ్యతిరేక విధానాలను అమలుపరుస్తుందని వివిధ కార్మిక నాయకులు తీవ్రంగా విమర్శించారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్స్, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలు, జాతీయ విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లులను వెంటనే రద్దు చేయాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోర్సుగా మార్చడం ద్వారా కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించిందని నేతలు విమర్శించారు. స్వాతంత్రం వచ్చిన 70 సంవత్సరాలు దాటినా కూడా కార్మికులు కనీస వేతనానికి నోచుకోకపోవడం దురదృష్టకరమన్నారు. కనీస వేతన చట్టాన్ని కఠినంగా అమలు చేసి నెలకు 26 వేల కనీస వేతనం ఇవ్వాలని నేతల డిమాండ్ చేశారు. ఈ ర్యాలీ నిరసన కార్యక్రమంలో సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎన్ టియుసి, వివిధ యూనియన్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్గీయ బండారి రాజిరెడ్డి సేవలు చిరస్మరణీయం

### - 79వ జయంతి సందర్భంగా ఘన నివాళులు






**ఏఎస్ రావునగర్, ఫిబ్రవరి 12, (తెలంగాణ దిశ) :**ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బండారి రాజిరెడ్డి 79వ జయంతి సందర్భంగా గురువారం ఏఎస్ రావునగర్ రాధిక చౌరస్తాలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, కొత్త రామారావు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, బండారి నీలంరెడ్డి మాట్లాడుతూస్వర్గీయ రాజిరెడ్డి ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. వారి కృషి ఫలితంగానే నియోజకవర్గంలో అనేక మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యాయని గుర్తు చేశారు. ప్రజలతో నేరుగా మమేకమై పనిచేసిన నాయకుడిగా రాజిరెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ రావునగర్ డివిజన్ కార్యదర్శి కుమార స్వామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాఘవ రెడ్డి, బైరి రాంచందర్ గౌడ్, బిఆర్ఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు షేర్ మనెమ్మ,బేతల బాలరాజు, ఎస్ఏ. రహీమ్, రమేష్ చారి, మాట్లగిరి, ఎంపి. దాస్, బడేటి చిన్న, గడ్డం శ్రీను, సంభాశివ రెడ్డి, గోలి శ్రీనివాస్, చిన్నరావు, పాషా, మొగులయ్య, సకినాల రవి, ప్రమోద్, పంతుల్ నర్సింహ, పిట్టల రాజు, నారా జనార్దన్, కృష్ణ, దేవిరాజు, పెంటయ్య గౌడ్ తదితరులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు. అనంతరం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నేపథ్యంలో ఆటో కార్మికులకు సంఘీభావంగా రాధిక చౌరస్తాలో నిర్వహించిన నిరసన ర్యాలీలో నాయకులు పాల్గొన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బండారి రాజిరెడ్డి జయంతి వేడుకలు

### - రాజన్న ఆశయాలను సాధించే దిశగా అడుగులు వేయాలి: బండారి నీలం రెడ్డి







**చర్లపల్లి, ఫిబ్రవరి 12, (తెలంగాణ దిశ) :**మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బండారి రాజిరెడ్డి జయంతిని పురస్కరించుకుని చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రిపురం చౌరస్తాలో పార్టీలకు అతీతంగా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, శ్రేయోభిలాషులు రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన సోదరుడు బండారి నీలం రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ బండారి రాజిరెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా, ఉప్పల్ నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా సేవలందించిన గొప్ప నాయకుడని గుర్తు చేశారు. పీడిత, బాధిత ప్రజలకు అండగా నిలిచి అనేక సేవలు అందించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడిగా రాజిరెడ్డి గుర్తింపు పొందారని కొనియాడారు. ఈ సందర్భంగా అభిమానులు "రాజన్న అమర్ హై", "జోహార్ రాజన్న", "రాజన్న ఆశయాలను సాధిద్దాం" అంటూ నినాదాలు చేశారు. పార్టీలకు అతీతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు, శ్రేయోభిలాషులు, నాయకులు, కార్యకర్తలు స్వర్గీయ రాజిరెడ్డికి ఘన నివాళులు అర్పించారు.

# మహా శివరాత్రి సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు

**కీసరగుట్ట, ఫిబ్రవరి 12, (తెలంగాణ దిశ) :** కీసరగుట్టలోని శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమలు చేయనున్నట్లు జవహర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధికారులు తెలిపారు. ఈ నెల 13 నుంచి 18 వరకు కీసరగుట్టలో బ్రహ్మోత్సవ వేడుకలు జరగనున్న నేపథ్యంలో, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 13 నుంచి 18 వరకు ఓఆర్ఆర్ లేదా చీర్యాల చౌరస్తా రోడ్డు నుంచి వచ్చే భారీ వాహనాలకు కీసర గ్రామం వైపు అనుమతి ఉండదు. అవి కీసర ఓఆర్ఆర్ వద్ద నుంచి ఘట్కేసర్ లేదా షామీర్‌పేట్ వైపు ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు ద్వారా మళ్లించబడతాయి. ఉద్దమర్రి, బొమ్మలరామారం నుంచి వచ్చే భారీ వాహనాలను కీసర గ్రామ చౌరస్తా రోడ్డు వైపు అనుమతించరు. వాటిని రంగాపురం చౌరస్తా వద్ద ఉద్దమర్రి, రంగాపురం చౌరస్తా లేదా బొమ్మలరామారం మార్గాల ద్వారా మళ్లిస్తారు. షామీర్‌పేట్ నుంచి కీసర గ్రామ చౌరస్తా రోడ్డు వైపు వచ్చే భారీ వాహనాలను యాద్గరిపల్లి వద్ద యాద్గరిపల్లి చౌరస్తా రోడ్డు ద్వారా ఘట్కేసర్ వైపు కుడి మలుపు తీసుకుని, ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు లేదా చీర్యాల గ్రామం మీదుగా ఈసీఐఎల్ వైపు మళ్లిస్తారు. బోగారం నుంచి కీసర విలేజ్ చౌరస్తా రోడ్డు వైపు వచ్చే భారీ వాహనాలను వన్నెగూడ చౌరస్తా వద్ద కీసర దయారా మీదుగా ఓఆర్ఆర్ వైపు పంపి, అక్కడి నుంచి ఘట్కేసర్ లేదా షామీర్‌పేట్ దిశగా మళ్లిస్తారు. పండుగ సందర్భంగా రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తుగా తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకుని, సూచించిన మార్గాలను అనుసరించాలని, రాచకొండ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్ వన్ మల్కాజిగిరి జోన్ విజ్ఞప్తి చేశారు.

# గుండె.. కొన్ని జాగ్రత్తలు

గుండె సమస్యలు ఉన్నవారు శీతాకాలంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ఉష్ణోగ్రత అకస్మాత్తుగా పడిపోవడం వల్ల రక్త నాళాలు సంకోచిస్తాయి. గుండెపై అదనపు ఒత్తిడి పెరిగి ఆక్సిజన్ సరఫరా తగ్గుతుంది. కాబట్టి తగిన ఉష్ణోగ్రత ఉన్న గదుల్లో ఎక్కువ గడపాలి. శరీర ఉష్ణోగ్రత 95 డిగ్రీల కంటే తక్కువగా ఉంటే, గుండె కండరాలకు హాని కలిగించే అల్పోష్ణస్థితికి గురవుతారు. చల్లని వాతావరణంలో ఎక్కువ సమయాన్ని గడిపేవారు, రక్తపోటు, డయాబెటిస్, అధిక కొలెస్ట్రాల్ సమస్యలున్నవారు, ధూమపానం, పొగాకు తీసుకునే వారికి ఈ స్థితి ఇబ్బందికరం. ఇలాంటి వారు శీతాకాలంలో ఎక్కువ శ్రమించాలి. వెచ్చగా ఉండటానికి ప్రయత్నించాలి. ఉన్ని బట్టలు, టోపీలు, గ్లౌజులు, సాక్సులు ధరించాలి. చల్లని వాతావరణంలో వ్యాయామం చేయొద్దు. ఇండోర్ వ్యాయామాలను ఎంచుకోవాలి. గుండెకు ఒత్తిడి కలిగించే వ్యాయామాలూ చేయొద్దు. మద్యపానం, ధూమపానం పూర్తిగా మానేయాలి. ఆల్కహాల్ చర్మంలోని రక్త నాళాలకు విస్తరించి, శరీరంలోని ముఖ్యమైన అవయవాల నుంచి వేడిని తీసుకుంటుంది. ధూమపానం గుండె వైపు ఆక్సిజన్ ప్రవాహాన్ని తగ్గిస్తుంది. హృదయ స్పందన రేటు, రక్తపోటును పెంచుతుంది. ఈ కాలంలో తాజా పండ్లు, కూరగాయలు, విత్తనాలు, కాయలు, చిక్కుళ్లు, పప్పుధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలి. భోజనం, సూప్ వేడివేడిగా తీసుకుంటూ ఉండాలి. ఉప్పు, చక్కెర బాగా తగ్గించాలి.

# థ్రాంబెక్టమీతో.. స్ట్రోక్‌కు చెక్



పక్షవాతం (స్ట్రోక్) చికిత్సను 2014వ సంవత్సరం కొత్తపుంతలు తొక్కించింది. ఆ ఏడాది అధునాతనమైన చికిత్సా పద్ధతి అందుబాటులోకి వచ్చింది. అదే.. థ్రాంబెక్టమీ. జనరల్ అనెస్తీషియా అవసరం లేని సర్జరీ ఇది. కేవలం లోకల్ అనెస్తీషియాతో స్ట్రోక్ వచ్చిన 24 గంటల్లోగా థ్రాంబెక్టమీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి. పక్షవాతంతో పోలిస్తే గుండెపోటు నుంచి బయటపడటం చాలా సులువు. గుండె ఎక్కడ ఉంటుందో గుండెపోటు లక్షణాలు కూడా అక్కడే ఉంటాయి. కానీ మెదడులో సమస్య వల్ల తలెత్తే పక్షవాతం లక్షణాలు ఏ కాళ్లూ చేతుల్లోనో కనిపిస్తాయి. అందుకే దీన్ని తొందరగా గుర్తించలేకపోతారు. అంతేకాదు.. గుండెపోటుకు ఒక్క ఈసీజీ చూసి చికిత్సకు సిద్ధం కావొచ్చు. పక్షవాతానికి మాత్రం సీటీ ఆంజియోగ్రామ్, సీటీ స్కాన్ లేదా ఎంఆర్ఐ ఆంజియోగ్రామ్, ఎంఆర్ఐ స్కాన్లు చేస్తారు. వీటిద్వారా వచ్చింది ఏ రకమైన పక్షవాతమో తెలియడం మాత్రమే కాకుండా, నాడీ కణజాలం ఎంతమేరకు ప్రభావితం అయ్యిందనే విషయం కూడా నిర్ధారణ అవుతుంది. ఇలా వైద్యులు సమస్యను పూర్తిగా గుర్తించి, తగిన చికిత్స చేస్తారు.

శరీరంలో కణాలన్నీ ఆరోగ్యంగా ఉండాలంటే కణ కణానికీ నిరంతరం రక్తం సరఫరా కావాలి. మెదడులోని కణాలు కూడా అంతే. ఏ కారణం చేతనైనా మెదడుకు తగినంత రక్తం అందకపోతే ఆయా కణాలు దెబ్బతిని చనిపోతాయి. ఇలా రక్తం అందకపోవడానికి ప్రధానంగా రెండు రకాల కారణాలున్నాయి. మొదటిది ఇస్కిమిక్ స్ట్రోక్. అంటే%ొా% మెదడుకు మొత్తం నాలుగు రక్తనాళాలు వెళ్తాయి. ఇందులో రెండు రక్తనాళాలు మెదడు ఎడమవైపుకి, రెండు కుడివైపుకి వెళ్తాయి. వీటిలో ఎక్కడైనా రక్తం గడ్డకడితే అది రక్త ప్రసరణకు ఆటంకం కలిగిస్తుంది. దాంతో మెదడుకు రక్తసరఫరా సరిగా జరగక పక్షవాతం వస్తుంది. దాదాపు 80 శాతం స్ట్రోక్ కేసులకు ఇదే కారణం. ఇక రెండో రకం హెమరేజిక్ స్ట్రోక్. ఈ రకం దానిలో రక్తనాళాల్లో ఏదైనా చిట్లిపోయి, రక్తం బయటికి రావడంతో మెదడులో కణాలు దెబ్బతింటాయి. ఇలాంటప్పుడు వచ్చే పక్షవాతం ఇది. దాదాపు 20 శాతం పక్షవాతం కేసులకు కారణం హెమరేజిక్ స్ట్రోక్.

ఎందుకు వస్తుంది?: పక్షవాతం రావడానికి ప్రధాన కారణం అధిక రక్తపోటు. మధుమేహం కూడా కారణమవుతుంది. బీపీ, మధుమేహం ఇంతకుముందైతే అరవయ్యేండ్ల వయసులో కనిపించేవి. కానీ ఇప్పుడు ముప్పైల్లోనే దాపురిస్తున్నాయి. అందుకే ఈ వయసు వాళ్లలో కూడా పక్షవాతం కనిపిస్తున్నది. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోకుండా జంక్‌ఫుడ్‌కు తినడం, ధూమపానం, మద్యపానం, డ్రగ్స్‌కు ఇప్పటి యువత అలవాటు పడుతున్నది. ఇవన్నీ కూడా పక్షవాతానికి కారణమయ్యేవే. మరో ముఖ్య కారణం అధిక ఒత్తిడి. కార్పొరేట్ ఉద్యోగాలు పెరిగిన తర్వాత చిన్న వయసులోనే అధిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. దాంతో నలభై ఏండ్లు దాటకుండానే పక్షవాతానికి గురవుతున్నారు. ఇలాంటి జీవనశైలి కారణాలతోపాటు జన్యుపరమైన అంశాలు కూడా పక్షవాతం రావడానికి దోహదపడతాయి.

పక్షవాతానికి మరో కారణం డైసెక్షన్. దీనిలో రక్తనాళంలోని రెండు పొరలు విచ్చుకుంటాయి. సాధారణంగా రక్తనాళంలో 3 పొరలు ఉంటాయి. వీటిలో మొదటి రెండు పొరలు తెరుచుకుని అందులోకి రక్తం వెళ్తుంది. దానివల్ల పక్షవాతం వస్తుంది. ఎక్కువగా మసాజ్ చేయించుకోవడం, లాంగ్ డ్రైవ్ చేయడం, డ్రైవ్ చేస్తూ మెడ వెనక్కి తిప్పడం వల్ల రక్తనాళాలు మెలితిరిగిపోయి ఇలాంటి సమస్య రావొచ్చు. చిన్నారుల్లో గుండెజబ్బుల వల్ల పక్షవాతం వచ్చే అవకాశాలు ఎక్కువ. ఆ తర్వాత సికిల్‌సెల్ ఎనీమియా, మోయా-మోయా అనే వ్యాధి (దీనిలో రక్తనాళాలు సన్నగా అవుతాయి) లాంటివి చిన్నపిల్లల్లో పక్షవాతానికి కారణమవుతాయి.

ఏం జరుగుతుంది?: మెదడులో నాడీ కణజాలానికి రక్త సరఫరాలో ఆటంకం ఏర్పడినప్పుడు ఆ కణాలకు పోషకాలు, ఆక్సిజన్ అందక అక్కడి కణాలు నశిస్తాయి. ఇలాంటప్పుడు ఏ నాడీ కణజాలం మన శరీరంలో ఏ పనిని నిర్వర్తిస్తుందో%ొా% ఆ కణజాలం దెబ్బతినడం వల్ల ఆయా పనులు చేయలేకపోతాం. ఉదాహరణకు కాలు, చెయ్యి కదలికలను నియంత్రించే నాడీ కణజాలానికి రక్తం అందక అది చచ్చుబడిపోతే ఇక కాలు, చెయ్యి కదిలించలేం. మాటకు సంబంధించిన నాడీ కణజాలం దెబ్బతింటే మాట పడిపోవడం, సరిగ్గా మాట్లాడలేకపోవడం లాంటి సమస్యలు వస్తాయి.

సమయం.. అత్యంత కీలకం!: నాడీకణాలు ఒకసారి చచ్చిపోతే ఇక కొత్త నాడీకణాలు ఏర్పడవు. కాబట్టి అవి నశించిపోకుండా చూసుకోవాలి. పక్షవాతం వచ్చినప్పుడు రక్త సరఫరా ఆగిపోయిన చోట ఉన్న కొన్ని కణాలు వెంటనే దెబ్బతింటాయి. నిమిష నిమిషానికీ ఇలా దెబ్బతినే కణాల సంఖ్య పెరుగుతూ పోతుంది. ఒక నిమిషానికి ఏడు వందల కోట్ల (7 బిలియన్ల) న్యూరాన్లు చనిపోతాయి. అందుకే పక్షవాతం వచ్చినప్పుడు ప్రతీ నిమిషం కీలకమైనదే. బ్లాక్ దగ్గర ఉన్న కణాల చుట్టూ కొంతమేర ఉండే కణజాలాన్ని పెనెంబ్రా అంటారు. దీన్ని రిస్క్‌లో ఉన్న కణజాలంగా పరిగణిస్తారు. ఈ కణజాలం ఎంత ఎక్కువ భాగం డ్యామేజి అయితే అంత ఎక్కువ నష్టం ఉంటుంది. సమయం మించిపోతున్న కొద్దీ ఫలితం వేరుగా ఉంటుంది. రిస్క్ కణజాలం మొత్తం డ్యామేజీ అయ్యిందంటే ఇక ఏ చికిత్సా అందించలేం. అందుకే పక్షవాతం వచ్చినప్పుడు రోగిని ఎంత తొందరగా హాస్పిటల్‌లో చేరిస్తే అంత మంచిది.

మొబైల్ స్ట్రోక్ యూనిట్స్: చాలా దేశాల్లో పక్షవాతానికి త్వరగా చికిత్స అందించడానికి ప్రత్యేకమైన అంబులెన్స్ యూనిట్లు ఉంటాయి. వీటిని మొబైల్ స్ట్రోక్ యూనిట్స్ అంటారు. ఈ అంబులెన్స్‌లోనే సీటీ స్కాన్, డాక్టర్, నర్సు అందరూ ఉంటారు. రోగి దగ్గరికి వెళ్లగానే అదే అంబులెన్సులో సీటీ స్కాన్ చేసి, అక్కడే ఇంజెక్షన్ ఇస్తారు. ఇలాంటి యూనిట్లను హైదరాబాద్‌లో కూడా ప్రారంభించే ఆలోచన ఉంది. అయితే మన దగ్గరి మొబైల్ స్ట్రోక్ యూనిట్లో సీటీ స్కాన్‌ను ఉంచలేం. అందువల్ల రోగిని సీటీ స్కాన్ చేయించుకోమని, ఆ రిపోర్ట్స్ వాట్సాప్‌లో పంపించమని వైద్యులు సూచిస్తారు. ఈలోపు అంబులెన్స్ పేషెంట్ దగ్గరికి చేరుకుంటుంది. అక్కడే వెంటనే ఇంజెక్షన్ చేసి రోగిని హాస్పిటల్‌కు తరలిస్తారు. పైగా రోగి హాస్పిటల్ దాకా వచ్చే సమయం మిగిలిపోతుంది కూడా!

ఎలా గుర్తించాలి?: మాటలో తేడా రావడం, నత్తి, సరిగ్గా మాట్లాడలేకపోవడం, విన్నది అర్థం చేసుకోలేకపోవడం, మూతి పక్కకు వెళ్లిపోవడం (ఫేషియల్ పెరాలిసిస్), ఒకవైపు చెయ్యి, కాలు బలహీనం కావడం, ఒక కాలు లేదా ఒక చెయ్యి బలహీనం కావడం, నడిస్తే అడుగులు తడబడటం, మనుషులు ఒక్కరే ఇద్దరుగా కనిపించడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సీటీ స్కాన్ చేయించాలి. పక్షవాతం నిర్ధారణ జరిగితే చికిత్స మొదలుపెట్టాలి.

చికిత్సతో బాగవుతుందా?: పక్షవాతానికి ఒకప్పుడు చికిత్స లేదు. కానీ గత 15 20 ఏండ్లుగా మంచి చికిత్స అందుబాటులో ఉన్నది. లక్షణాలు కనిపించిన మొదటి నాలుగున్నర గంటలలోగా హాస్పిటల్‌లో చేరాలి. వెంటనే తగిన చికిత్స తీసుకుంటే శరీరంలో ఎలాంటి అవకరాలు ఏర్పడకుండా ఉంటాయి. రోగిని హాస్పిటల్‌లో చేర్చగానే వైద్యులు సీటీ స్కాన్ చేస్తారు. ఇందులో రక్తనాళం చిట్లి రక్తస్రావం కావడం వల్ల పక్షవాతం వచ్చిందా, లేదా బ్లాక్ వల్ల వచ్చిందా అనేది తెలుస్తుంది. రక్తస్రావం వల్ల కాకుండా బ్లాక్ వల్ల వచ్చిన ఇస్కిమిక్ స్ట్రోక్ అయితే వెంటనే క్లాట్ కరగడానికి ఒక ఇంజెక్షన్ ఇస్తారు. ఇది టిష్యూ ప్లాస్మోజెన్ యాక్టివేటర్ (టిపిఎ)లేదా టెనెక్టిప్లేస్ ఇంజెక్షన్. ఇలా ఇంజెక్షన్ ఇవ్వడాన్ని థ్రాంబోలైటిక్ థెరపీ అంటారు. ఈ ఇంజెక్షన్ వల్ల రక్త సరఫరాకు ఆటంకంగా ఉన్న గడ్డ కరిగిపోయి రక్తనాళం తెరుచుకుం టుంది. దాంతో రక్త సరఫరా సాఫీగా జరుగుతుంది. ఫలితంగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న నాడీ కణాలకు ఆక్సిజన్ అంది, అవి మెరుగుపడ తాయి. ఇంజెక్షన్ ఇచ్చినప్పటికీ రక్తనాళంలో గడ్డ కరగకుండా రక్తనాళం తెరుచుకోకపోతే, మెకానికల్ థ్రాంబెక్టమీ చేస్తారు. అంటే ఎండోవాస్కు లర్ థెరపీ ద్వారా కేథటర్ పంపి, క్లాట్ తీసేస్తారు. ఇది 6 గంటలలోపు చేయాలి. కొందరిలో 24 గంటల లోపు కూడా చేయవచ్చు.

ఫిజియోథెరపీ అవసరమే: పక్షవాతం నుంచి కోలుకోవడానికి ఫిజియోథెరపీ అత్యంత ముఖ్యమైన చికిత్స. ఫిజియోథెరపీలో స్ట్రెంథెనింగ్ వ్యాయామాలు చేయిస్తారు. కండరాల్లో స్టిఫ్‌నెస్ పోవడానికి ఇంజెక్షన్లు ఇస్తారు. వాకింగ్ చేయిస్తారు. ఇలాంటి వాటివల్ల పక్షవాతానికి గురైన అవయవాలు తిరిగి శక్తి పుంజుకుంటాయి. వాటి పనితీరు మెరుగుపడుతుంది. థ్రాంబోలైటిక్ థెరపీ ఇంజెక్షన్లు జిల్లా స్థాయిలో అందుబాటులో ఉంటే చికిత్స అక్కడికక్కడే వెంటనే ఇవ్వొచ్చు. అలా హైదరాబాద్ వరకూ వచ్చే టైం మిగులుతుంది. రోగి కోలుకునే అవకాశాలు పెరుగుతాయి.

సర్జరీ ఏంటి?: సాధారణంగా పక్షవాతం (స్ట్రోక్) వస్తే ప్రతి పదిమందిలో నలుగురికి ఇంజెక్షన్ అవసరమైతే, ఇద్దరికి సర్జరీ అవసరం అవుతుంది. అయితే, సర్జరీ అనగానే ఇదేదో పెద్ద కోతపెట్టి చేసే ఆపరేషన్ అని భయపడనక్కర్లేదు. కాలి రక్తనాళం ద్వారా కేథటర్ గుండా స్టెంట్ రిట్రీవర్ అనే పరికరాన్ని క్లాట్ దగ్గరికి పంపించి, దాన్ని తొలగిస్తారు. దీన్ని థ్రాంబెక్టమీ అంటారు. రోగి తొడ భాగంలో చిన్న కోత పెట్టి ఆప్టిక్ ఫైబర్ కేబుల్‌ను రక్తనాళం గుండా మెదడులో మూసుకుపోయిన రక్తనాళంలోకి పంపిస్తారు. తర్వాత సున్నితమైన గొడుగు లాంటి స్టెంట్ రిట్రీవర్‌ను కేథటర్ గుండా పంపిస్తారు. మెదడు రక్తనాళంలో పూడిక ఉన్న చోట స్టెంట్ రిట్రీవర్ గొడుగు లాగా తెరుచుకుని అక్కడ అడ్డంగా ఉన్న గడ్డను తనలోకి లాగేసుకుంటుంది. అప్పుడు దాన్ని బయటికి లాగేస్తారు. రక్తనాళంలో ఏర్పడ్డ గడ్డ తొలగిపోవడంతో రక్త ప్రసరణ సాఫీగా కొనసాగుతుంది.

సర్జరీ.. ఎప్పుడు?: రక్తనాళంలో చిన్న చిన్న గడ్డలు లేదా క్లాట్స్ ఏర్పడినప్పుడు చేతికి ఇంజెక్షన్ ఇస్తే అవి కరిగిపోతాయి. కానీ రక్తనాళంలో ఏర్పడే పెద్ద పెద్ద క్లాట్స్‌ను కరిగించాలంటే ఈ థ్రాంబోలైటిక్ థెరపీ ఇంజెక్షన్‌తోపాటు సర్జరీ కూడా అవసరం అవుతుంది. పక్షవాతం వచ్చిన నాలుగున్నర గంటల తర్వాత హాస్పిటల్‌కు తీసుకువచ్చినా సర్జరీ తప్పనిసరి. ఇంజెక్షన్ ఇవ్వలేని పరిస్థితులు ఉన్నవాళ్లకు కూడా సర్జరీ అవసరం ఏర్పడుతుంది. అంటే థ్రాంబోలైటిక్ ఏజెంట్స్ లాంటి మందులు తీసుకున్నవాళ్లు, అంతకు ముందు నెలలోపు సర్జరీ అయినవాళ్లు, ఇటీవలే స్ట్రోక్ వచ్చినవాళ్లకు థ్రాంబోలైటిక్ థెరపీ చేయలేం. ఇలాంటివాళ్లకు థ్రాంబెక్టమీ సర్జరీ చేస్తారు. సాధారణంగా స్ట్రోక్ వచ్చిన నాలుగున్నర గంటల్లోగా థ్రాంబోలైటిక్ థెరపీ తీసుకోవాలి. ఏ కారణం చేతనైనా హాస్పిటల్‌కు రావడం ఆలస్యం అయినవాళ్లకు ఈ థ్రాంబెక్టమీ మరో దారి చూపిస్తుంది. ఈ సర్జరీని పక్షవాతం వచ్చిన 24 గంటల్లోగా చేయవచ్చు. ఒకసారి చేసిన తర్వాత కూడా ఈ సర్జరీని ఎన్నిసార్లయినా చేయొచ్చు. సర్జరీ తర్వాత పక్షవాత రోగుల్లో 5 నుంచి 20 శాతం మందిలో మెదడులో వాపు రావొచ్చు. వారికి ఓపెన్ సర్జరీ అవసరం పడొచ్చు.

పక్షవాతంతో ఇక భయం లేదు!: ఎంత చెట్టుకు అంత గాలి.. ఇది ఒకప్పటి సామెత. ఎన్ని చెడ్డ అలవాట్లుంటే అన్ని రోగాలు.. ఇది ఇప్పటి మాట. మారిన ఆహార పద్ధతులు, చిన్న వయసులోనే దుర్వ్యసనాల బారినపడటం.. వెరసి ఎప్పుడో 60 ఏండ్లు దాటాక వచ్చే జబ్బులు ఇప్పుడు పాతికేండ్లకే వచ్చిపడుతున్నాయి. అలాంటి వ్యాధుల సరసన పోటీ పడుతున్న జబ్బుల్లో పక్షవాతం ఒకటి. చిన్నవయసులోనే పక్షవాతం బారినపడుతున్న వాళ్ల సంఖ్య రోజురోజుకూ ఎక్కువవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా మరణాలకు, అంగవికలత్వానికి పక్షవాతం రెండో కారణంగా మారింది. అలాగని పక్షవాతం బారినపడ్డామని కుంగిపోనవసరం లేదు. త్వరగా హాస్పిటల్‌లో చేరితే పక్షవాతం వచ్చినా కూడా ఎప్పట్లా జీవించే వీలుంది. పక్షవాతం లక్షణాలు, చికిత్సల గురించి అవగాహన పెంచుకుని సకాలంలో గుర్తించి, చికిత్స తీసుకోవాలి.

# వేసవి సీజన్‌లో పుచ్చకాయలను విడిచిపెట్టకుండా తినాల్సిందే..



వేసవి కాలంలో అందరూ చల్లని పదార్థాలను తింటుంటారు. వేసవి తాపం నుంచి తట్టుకోవాలంటే కచ్చితంగా చలువ చేసే ఆహారాలను తినాలి. వేసవి వచ్చిందంటే మనకు ముందుగా గుర్తుకు వచ్చేది పుచ్చకాయలు. ఈ సీజన్ లో మనకు ఈ పండ్లు ఎక్కడ చూసినా కనిపిస్తూనే ఉంటాయి. పుచ్చకాయలను చాలా మంది నేరుగా అలాగే తింటారు. కొందరు జ్యూస్, సలాడ్స్ వంటివి తయారు చేసి తీసుకుం టారు. పుచ్చకాయలను మనం ఎలా తిన్నా సరే మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలే కలుగుతాయి. వేసవి సీజన్‌లో కచ్చితంగా రోజూ పుచ్చకాయలను తినాలి. ఇవి మన శరీరానికి చేసే మేలు అంతా ఇంతా కాదు. పుచ్చకాయలను తినడం వల్ల అనేక పోషకాలు కూడా లభిస్తాయి. వీటిని రోజూ ఒక కప్పు మోతాదులో తిన్నా చాలు ఎంతో మేలు కలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.


బరువు తగ్గుతారు..: 00 గ్రాముల పుచ్చకాయలను తింటే కేవలం 16 క్యాలరీల శక్తి మాత్రమే లభిస్తుంది. అలాగే ప్రోటీన్లు 2 గ్రాములు, కార్బొహైడ్రేట్లు 3.3 గ్రాములు, కొవ్వులు 0.2 గ్రాములు, పీచు 0.6 గ్రాములు, సోడియం 27.3 మిల్లీగ్రాములు, పొటాషియం 160 మిల్లీగ్రాములు లభిస్తాయి. అలాగే ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగానే ఉంటాయి. ఫ్లేవనాయిడ్స్ సైతం సమృద్ధిగా లభిస్తాయి. పుచ్చకాయలను తింటే చాలా స్వల్ప మోతాదులో క్యాలరీలు లభిస్తాయి. కనుక బరువు తగ్గాలనుకునే వారికి ఇవి చక్కని ఆహారం అని చెప్పవచ్చు. వీటిని తింటే చాలా తక్కువగా క్యాలరీలు లభిస్తాయి. పైగా ఎక్కువ సేపు ఉన్నా కడుపు నిండిన భావనతో ఉంటారు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఆకలి కూడా వేయదు. దీని వల్ల బరువు తగ్గుతారు. అధిక బరువు ఉన్నవారు రోజూ ఈ పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది.

గుండె, కిడ్నీల ఆరోగ్యానికి..: పుచ్చకాయల్లో అధికంగా ఉండే పొటాషియం మన శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. రక్తం సాఫీగా ప్రసరణ అయ్యేలా చూస్తుంది. దీంతో బీపీ నియంత్రణ లోకి వస్తుంది. హైబీపీ ఉన్నవారు పుచ్చకాయలను రోజూ తింటే ఎంతో మేలు పొందవచ్చు. అలాగే మూత్రాశయ సమస్యలు, మూత్రా శయ ఇన్‌ఫెక్షన్లు, కిడ్నీ స్టోన్లు ఉన్నవారు ఈ కాయలను రోజూ తిం టున్నా లేదా వీటి జ్యూస్‌ను తాగుతున్నాఆయా సమస్యలనుంచి .

బయట పడవచ్చు. కిడ్నీలు క్లీన్ అవుతాయి. కిడ్నీల్లోని వ్యర్థాలు బయటకు పోతాయి. స్టోన్స్ కరిగిపోతాయి. కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. పుచ్చకాయల్లో ఉండే యాటీ ఆక్సిడెంట్లు ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తా యి. దీంతోకణాలకు నష్టం జరగకుండా నివారించవచ్చు. దీని వల్ల క్యాన్సర్, హార్ట్ ఎటాక్‌వంటి ప్రాణాంతకవ్యాధులురాకుండా అడ్డుకోవచ్చు.

వేసవి తాపం నుంచి ఉపశమనం..: వేసవిలో మన శరీరం సహజంగానే వేడిగా అవుతుంది. శరీరంలో వేడి పెరిగిపోతుంది. డీహైడ్రేషన్ బారిన పడతారు. శరీరంలోని ద్రవాలు త్వరగా బయటకు పోతాయి. కనుక ఈ సీజన్‌లో తప్పకుండా పుచ్చకాయను రోజూ తినాలి. ఇది శరీరంలోని వేడిని బయటకు పంపుతుంది. శరీరం చల్లగా ఉండేట్లు చూస్తుంది. వేసవి తాపం నుంచి ఉపశమనం లభిస్తుంది. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. ఎండ దెబ్బ తగలకుండా సురక్షితంగా ఉండవచ్చు. వేసవిలో బయట తిరిగే వారి చర్మం కమిలిపోయినట్లు ఎర్రగా లేదా నల్లగా మారుతుంది. అలాంటి వారు రోజూ పుచ్చకాయలను తినాలి. దీంతో చర్మం సంరక్షించబడుతుంది. చర్మం రంగు మారకుండా ఉంటుంది. ఇలా పుచ్చకాయలను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. కాబట్టి వేసవి సీజన్‌లో మరిచిపోకుండా ఈ పండ్లను తినండి.

# తరచూ రక్త విరేచనాలు అవుతున్నాయి



మా బాబుకు పద్నాలుగు ఏండ్లు. ఆరు నెలల నుంచి తరచుగా విరేచనాలు అవుతున్నాయి. విరేచనం కొద్దికొద్దిగా అయ్యింది. కొన్నిసార్లు రక్తం కూడా పడింది. డాక్టర్ దగ్గరకు వెళ్తే మందులు ఇచ్చారు. వాటిని వాడినప్పుడు తగ్గడం.. కొన్నాళ్లకు మళ్లీ విరేచనాలు అవ్వడం సాధారణమై పోయింది. ఈ ఆరు నెలల్లో బరువు తగ్గాడు. ఎప్పుడూ నీరసంగా ఉంటున్నాడు. పరిష్కారం ఏంటి?

పిల్లలకు అప్పుడప్పుడూ విరేచనాలు కావడం సాధారణమే. వైరస్ ఇన్ఫెక్షన్ వల్ల అలా జరుగుతుంది. అప్పుడప్పుడూ నీళ్ల విరేచనాలు కూడా అవుతాయి. కొన్నిసార్లు వాంతులతో మొదలవుతాయి. కొన్నిరోజులకు తగ్గుతాయి. తగ్గకపోతే లక్షణాన్ని బటి వైద్యం చేయించాల్సి ఉంటుంది. ఓఆర్‌ఎస్ నీళ్లు తాగడం, ప్రో బ్యాక్టీరియా పదార్థాలు తినడం వల్ల సాధారణ విరేచనాలు తగ్గుతాయి. కానీ ఆరు నెలల నుంచి పదే పదే విరేచనాలు అవ్వడం, రక్తం పడటం, బరువు తగ్గడం, నీరసంగా ఉండటం మంచి లక్షణాలు కావు. దీనికి ఏదైనా బలమైన కారణం ఉందేమో తెలుసుకోవాలి. ఇన్‌ఫ్లమేటరీ బవల్ సిండ్రోమ్ అనే పేగు సంబంధమైన సమస్యలు ఉంటే ఇలాగే అవుతుంది. దానిని క్రాన్స్ డిసీజ్ అంటారు. ఇది పిల్లలకే కాదు పెద్దలకూ వస్తుంది. పేగుల్లో రియాక్షన్ వల్ల ఇన్‌ఫ్లమేషన్ కలుగుతుంది. ఆహారం జీర్ణం కాకపోవడం, రక్తం పోవడం వల్ల రక్తహీనత బారినపడతారు. అందువల్ల నీరసంగా ఉంటారు. మీ ఇంట్లో ఇలాంటి లక్షణాలతో ఎవరైనా ఉన్నారా? అన్నది రాయలేదు. బహుశా లేకపోవచ్చేమో! పిల్లల వైద్యులను.. అలాగే గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌ని సంప్రదించి తీవ్రమైన, దీర్ఘకాల వ్యాధి కాదని నిర్ధారించుకోవాలి. ఒకవేళ ఇది ఇన్‌ఫ్లమేటరీ బవల్ సిండ్రోమ్ అయితే దానికి చికిత్స ఉంది. ప్రత్యేకమైన మందులు వాడుతూ, కొన్ని ఆహార నియమాలు పాటిస్తే తగ్గుతుంది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా పీడియాట్రీషియన్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌ని కలవండి.

# పిల్లల తెలివికి కాలుష్యం కాటు



పిల్లలు తమ బాల్యం తొలి సంవత్సరాల్లో ఎక్కువ మోతాదులో కాలుష్యానికి గురవుతే మెదడులో ఆలోచన, శరీర నియంత్రణకు సంబంధించిన భాగాలపై తీవ్రమైన ప్రభావం పడుతుందట. ఎన్విరాన్‌మెంట్ ఇంటర్నేషనల్ అనే జర్నల్‌లో ప్రచురితమైన ఓ పరిశోధన ఈ విషయం వెల్లడించింది. వాయు కాలుష్యం పిల్లల మెదడు అభివృద్ధికి ముప్పుగా పరిణమిస్తుందని హెచ్చరించింది. స్పెయిన్ దేశానికి చెందిన బార్సెలోనా ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ ఆధ్వర్యంలో ఈ పరిశోధన జరిగింది. పరిశోధన కోసం 3,626 మంది పిల్లల నుంచి సమాచారం సేకరించారు. వీళ్లంతా పార్టిక్యులేట్ మ్యాటర్ 2.5, పార్టిక్యులేట్ మ్యాటర్ 10, నైట్రోజన్ డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ల కాలుష్యం బారినపడిన ప్రాంతాల్లో నివసించేవాళ్లే. పుట్టినప్పటి నుంచి మూడేండ్ల వరకు వాయు కాలుష్యం బారినపడితే శరీర కదలికలు, వినికిడికి సంబంధించిన మెదడు భాగాల్లో నాడుల మధ్య అనుసంధానం తక్కువగా ఉంటుందని ఈ పరిశోధన ఫలితాలు వెల్లడించాయి. అయితే, ఈ ఫలితాలను కచ్చితంగా నిర్ధారించడానికి మరింత అధ్యయనం అవసరమని పరిశోధకులు తెలిపారు.

# దక్షిణాసియాకు 3,300 విమానాలు అవసరం




రాబోయే రెండు దశాబ్దాల్లో భారతదేశంతో పాటు దక్షిణ ఆసియా ప్రాంతంలో విమాన ప్రయాణికుల రద్దీ అత్యంత వేగంగా పెరగనుందని అంతర్జాతీయ విమానయాన దిగ్గజం బోయింగ్ అంచనా వేసింది. బోయింగ్ తన 'కమర్షియల్ మార్కెట్ అవుట్‌లుక్' నివేదికను బుధవారం వింగ్స్ ఇండియా ప్రదర్శనలో విడుదల చేసింది. ఆ వివరాలు.. 2044 నాటికి దక్షిణాసియాలో పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి సుమారు 3,300 కొత్త విమానాలు అవసరమవుతాయని వెల్లడించింది. పెరుగుతున్న మధ్యతరగతి జనాభా, ఆర్థిక విస్తరణ, విమానాశ్రయాల మౌలిక సదుపాయాల కల్పనలో వస్తున్న మార్పులు విమానయాన రంగాన్ని ఏటా 7 శాతం పెరిగేలా చేస్తోందని బోయింగ్ కమర్షియల్ మార్కెటింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ నాయుడు అంచనా వేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 795 విమానాలు ఉండగా, ఇవి రాబోయే 20 ఏండ్లలో దాదాపు నాలుగు రెట్లు పెరిగి 2,925కు చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఇందులో 90 శాతం విమానాలు స్వల్ప, మధ్యస్థ దూర ప్రయాణాలకు అనుకూలమైన సింగిల్-ఐసిల్ రకానికి చెందినవే ఉంటాయని తెలిపింది. ఈ భారీ విస్తరణకు తోడుగా విమానయాన రంగంలో మెయింటెనెన్స్, శిక్షణ వంటి సేవల కోసం 195 బిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయన్నారు. అలాగే సుమారు 1,41,000 మంది పైలట్లు, టెక్నీషియన్లు, ఇతర సిబ్బందికి కొత్తగా ఉపాధి లభిస్తాయని అంచనా వేశారు.

## బంగారం ధర ఆల్‌టైమ్ రికార్డ్.. 10 గ్రాములు ఏ రూ.1,60,850..!

గోల్డ్ లవర్స్‌కు ఊహించని షాక్ తగులుతోంది. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో దేశీయంగా బంగారం ధరలు మునుపెన్నడూ లేని విధంగా భారీగా పెరిగి ఆల్ టైమ్ రికార్డుకు చేరాయి. తాజాగా హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఇవాళ బంగారం ధర భారీగా పెరిగి ఆల్ టైమ్ రికార్డుకు చేరింది. 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.11,770 పెరిగి రూ.1,60,850కు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.10,800 ఎగబాకి రూ.1,63,950 పలుకుతోంది. మరోవైపు కేజీ వెండి ధర రూ.4,25,000 వద్ద కొనసాగుతోంది. అదేవిధంగా4 గ్లోబల్ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 5,500 డాలర్ల మార్కును దాటింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడం, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ అనిశ్చితి వల్ల ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపడంతో బంగారం ధరలు విపరీతంగా పెరిగాయి. ఇక భారత్‌లో పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న తరుణంలో ఈ స్థాయిలో ధరలు పెరగడం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. కేవలం బంగారం ధర మాత్రమే కాకుండా, అందుకు తోడు 3 శాతం జీఎస్టీ, షాపుల వారీగా తయారీ కూలి అదనంగా ఉండటంతో వినియోగదారులపై తీవ్ర భారం పడుతోంది.



## భారతీయ వాహనాలపై 50 శాతం సుంకం విధించే యోచనలో దక్షిణాఫ్రికా




భారత్, చైనా నుంచి దిగుమతి చేసుకునే వాహనాలపై 50 శాతం వరకు సుంకాలను విధించే అంశాన్ని దక్షిణాఫ్రికా పరిశీలిస్తున్నట్లు సమాచారం. పెరుగుతున్న వాహనాల దిగుమతుల వల్ల స్థానిక ఆటో తయారీ పరిశ్రమపై పడుతున్న ప్రభావాన్ని నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ నిర్ణయం ఆ దేశ ట్రేడ్, ఇండస్ట్రీ, కాంపిటీషన్ డిపార్ట్‌మెంట్ సమీక్ష పరిధిలో ఉంది. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం, కీలక ఎగుమతి మార్కెట్లుగా ఉన్న భారత్, చైనా నుంచి వాహనాలను నిలువరించేలా మార్గాలను గుర్తించేందుకు ఒక అంతర్గత సమీక్ష జరిగింది. ఈ రెండు దేశాల నుంచి జరిగే దిగుమతులు దక్షిణాఫ్రికా వాహన పరిశ్రమ పోటీతత్వాన్ని దెబ్బతీస్తున్నాయని అక్కడి అధికారులు భావిస్తున్నారు.

డిపార్ట్‌మెంట్ అధికారులు అత్యంత ప్రాధాన్యత కలిగిన దేశాలైన భారత్, చైనాకు సంబంధించి ప్రపంచ వాణిజ్య సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా దిగుమతి సుంకాలను పరిశీలిస్తోంది. ఇటీవలి డేటా ప్రకారం, భారత్, చైనా దక్షిణాఫ్రికాకు రెండు అతిపెద్ద వాహన ఎగుమతిదారులుగా అవతరించాయి. 2024లో మొత్తం వాహన దిగుమతులలో భారత్ 53 శాతం, చైనా 22 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఈ స్థాయి దిగుమతుల వల్ల స్థానిక వాహన పరిశ్రమకు నష్టాలు ఎదురవుతాయని దక్షిణాఫ్రిక అభిప్రాయపడింది.

అంతేకాకుండా, గత నాలుగేళ్ల కాలంలో చైనా నుండి ఆ దేశానికి ఎగుమతులు 368 శాతం, భారత్ నుంచి 135 శాతం పెరిగాయి. ఇది ఆ దేశ వాహన పరిశ్రమలో ఎంట్రీ-లెవెల్ విభాగంలో అత్యధిక పోటీ ఏర్పడింది. అందుకే పన్నుల ద్వారా భారత్, చైనా వాహనాల దిగుమతులని నియంత్రించి, స్థానిక పరిశ్రమను కాపాడుకోవాలని దక్షిణాఫ్రికా వెల్లడించింది.

## మరోసారి రిలయన్స్ గ్రూప్ ఆస్తులను జప్తు చేసిన ఈడీ...



ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానికి చెందిన రిలయన్స్ గ్రూప్, దాని కంపెనీలపై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా తాజాగా ఈడీ 1,885 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్టు బుధవారం ప్రకటాలో వెల్లడించింది. తాజా చర్యలతో, ఈ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ జప్తు చేసిన మొత్తం ఆస్తుల విలువ ఇప్పుడు సుమారు రూ. 12,000 కోట్లకు చేరింది. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ నివారణ చట్టం (పీఎంఎల్ఏ) కింద నాలుగు వేర్వేరు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈడీ ఓ ప్రకటనలో తెలిపింది. జప్తు చేసిన ఆస్తులలో బ్యాంక్ బ్యాలెన్స్, రిసీవబుల్స్, అన్‌క్యూటెడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వాటా, ఇతర స్థిరాస్తులు ఉన్నాయి. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, యెస్ బ్యాంక్ మోసంతో పాటు రిలయన్స్ కమ్యూనికేషన్ లిమిటెడ్‌కు సంబంధించిన ఆరోపణల కేసులలో ఈ జప్తులు జరిగాయి. తాజా జప్తులో బీఎస్ఈఎస్ యమునా పవర్, బీఎస్ఈఎస్ రాజధాని పవర్, ముంబై మెట్రో వన్ ప్రైవేట్‌లో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఉన్న వాటాలు కూడా ఉన్నాయని ఈడీ తెలిపింది. అలాగే, వాల్యూ కార్ప్ ఫైనాన్స్ అండ్ సెక్యూరిటీస్ లిమిటెడ్ వద్ద ఉన్న రూ. 148 కోట్ల బ్యాంకు డిపాజిట్లు, రూ. 143 కోట్ల వసూలు చేయాల్సిన మొత్తం, కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అంగరై సేతురామన్ పేరు మీద ఉన్న ఒక నివాస గృహం, మరో సీనియర్ ఉద్యోగి పునీత్ గార్గ్ భార్యకు చెందిన షేర్లు, మ్యూచువల్ ఫండ్‌లను కూడా జప్తు చేసినట్లు ఈడీ పేర్కొంది.


## బడ్జెట్‌లో దీర్ఘకాలిక ప్రణాళికపై దృష్టి పెట్టాలి



ప్రపంచం 'అత్యంత ప్రమాదకరమైన సందర్భం'లో ఉన్నందున, రాబోయే బడ్జెట్ భారత ఆర్థికవ్యవస్థను మరింత పటిష్టంగా, స్వయం సమృద్ధిగా మార్చేలా ఉండాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో వృద్ధిని వేగవంతం చేయడానికి దీర్ఘకాలిక ప్రణాళికతో అనుసంధానం చేయాలని రాజన్ సూచించారు. బుధవారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. గతంలో దేశానికి పంచవర్ష ప్రణాళికలు ఉండేవి, అయినప్పటికీ దేశ బడ్జెట్ వాటితోసరిగ్గా అనుసంధానం కాలేదు. కాబట్టిఈసారి 2026-27 కేంద్ర బడ్జెట్‌ను దీర్ఘకాలిక దార్శనికత, ప్రణాళికతో అనుసంధానం చేయాలని నేను భావిస్తున్నాను. ఒక ఆర్థికవ్యవస్థగా మరింత పటిష్టంగా, స్వయం సమృద్ధిగా మారాలి, అదే సమయంలో వేగంగా వృద్ధి చెందాలి, దానివల్ల ఇతర దేశాలన్నీ భారత్‌తో స్నేహం చేయాలనుకుంటాయి. దీనికి చాలా కృషి చేయాల్సి ఉంది, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయే తదుపరి బడ్జెట్ మనల్ని ఆ దిశగా తీసుకువెళ్తుందని నేను ఆశిస్తున్నానని ఆయన వివరించారు. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈసారి అస్థిరంగా మారినభౌగోళిక రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక వృద్ధినిబలోపేతం చేయడానికి సంస్కరణ చర్యలు ఉంటాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రఘురామ్ రాజన్ పైవ్యాఖ్యలు చేశారు.

## అమెజాన్‌లో 16,000 ఉద్యోగాల కోత

అమెరికా ఇకామర్స్ దిగ్గజ సంస్థ అమెజాన్, ప్రపంచవ్యాప్తంగా 16,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. గత అక్టోబరులో 14,000 మందిని తొలగించిన ఈ సంస్థ, రాబోయే మూడు నెలల్లో 16,000 మందిని తొలగించేందుకు సిద్ధమవుతోంది. కార్పొరేట్ ఉద్యోగులకు బదులు జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించడం వల్లే, ఈ తొలగింపులు చేపడుతున్నట్లు అమెజాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గాలెట్టీ తెలిపారు. కొవిడ్-19 పరిణామాల్లో నియమించుకున్న ఉద్యోగులనూ తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. వెబ్ సర్వీసెస్, రిటెయిల్, ప్రైమ్ వీడియో, మానవ వనరుల వంటి వివిధ కార్పొరేట్ రోల్స్‌ల్లో ఉన్న 30,000 మంది ఉద్యోగులను తీసివేయాలన్నది సంస్థ లక్ష్యం. 2023లో సంస్థ 27,000 మంది ఉద్యోగులను తొలిగించాక, మళ్లీ అధికంగా కోత విధిస్తోంది ఇప్పుడే.




## ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి విలువ



అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ ప్రభావంతో భారత కరెన్సీ రూపాయి విలువ ఆల్‌టైమ్ కనిష్ట స్థాయికి పడిపోయింది. ఇవాళ ఇంట్రాడే ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 92 స్థాయిని తాకి చరిత్రలోనే సరికొత్త రికార్డు పతనాన్ని నమోదు చేసింది. భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ నిధులను భారీగా వెనక్కి తీసుకుంటున్నారు. కేవలం ఈ నెలలోనే రూ.వేల కోట్ల విలువైన షేర్లను విక్రయించడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ ధరలు బ్యారెల్‌కు 65-67 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి. చమురు దిగుమతుల కోసం భారత్ ఎక్కువ డాలర్లను ఖర్చు చేయాల్సి రావడంతో రూపాయి విలువ పడిపోతోంది.

దిగుమతిదారులు, బ్యాంకుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం, అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ బలోపేతం కావడం రూపాయి పతనానికి కారణం అయ్యాయి. రూపాయి పతనం కేవలం సామాన్యులపై కూడా ప్రభావం చూపనుంది. మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, విదేశీ యంత్రాల ధరలు పెరిగే అవకాశం ఉంది. ఇంధన ధరలపై ప్రభావంతో రవాణా ఖర్చులు పెరిగి ద్రవ్యోల్బణానికి దారితీసే అవకాశం ఉంది. అదేవిధంగా విదేశాల్లో చదువుకునే విద్యార్థులు చెల్లించే ఫీజులు భారం కానున్నాయి. అలాగే విదేశీ పర్యటనలు ప్లాన్ చేసే వారికి ఖర్చులు పెరగనున్నాయి.

## యూఎస్ ఫెడ్ కీలక నిర్ణయం...

ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమావేశం ముగిసింది. 2026 సంవత్సరానికి సంబంధించి కీలక వడ్డీ రేట్లను మార్చకుండా యథాతథంగా కొనసాగించాలని ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ నిర్ణయించింది. గతేడాది చివరలో వరుసగా మూడు సార్లు రేట్లను తగ్గించిన ఫెడ్, ప్రస్తుతం బెంచ్‌మార్క్ వడ్డీ రేటును 3.50 శాతం నుంచి నుండి 3.75 శాతంతో స్థిరంగా కొనసాగించింది. మెజారిటీ సభ్యులు ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వడ్డీ రేట్లలో మార్పులు చేయకూడదని ఓటు వేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ మాట్లాడుతూ.. ఫెడ్ నిర్దేశించుకున్న 2 శాతం ద్రవ్యోల్బణ లక్ష్యం కంటే ప్రస్తుత గణాంకాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ఇది పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు వేచి చూడాలని ఫెడ్ నిర్ణయించిందని అన్నారు. అమెరికా ఫెడ్ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపనుంది. రేట్ల తగ్గింపు లేకపోవడంతో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లులు భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి నిధులను విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. గతేడాది చివరలో వరుసగా మూడు సార్లు రేట్లను తగ్గించిన ఫెడ్, ప్రస్తుతం బెంచ్‌మార్క్ వడ్డీ రేటును 3.50 శాతం నుంచి నుండి 3.75 శాతంతో స్థిరంగా కొనసాగించింది. మెజారిటీ సభ్యులు ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వడ్డీ రేట్లలో మార్పులు చేయకూడదని ఓటు వేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ మాట్లాడుతూ.. ఫెడ్ నిర్దేశించుకున్న 2 శాతం ద్రవ్యోల్బణ లక్ష్యం కంటే ప్రస్తుత గణాంకాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు.దీంతో సెన్సెక్స్, నిఫ్టీలపై ఒత్తడి పడనుంది. ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోవడంతో అమెరికా కంపెనీలు తమ టెక్నాలజీ ఖర్చులను నియంత్రిండంతో మన ఐటీ కంపెనీల ఆదాయంపై ప్రభావం చూపనుంది. ఇక బంగారం ధరలు స్థిరంగా కొనసాగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.



# నేడు జిల్లాలోని మూడు మున్సిపాలిటీల ఓట్ల లెక్కింపు

## - ఓట్ల లెక్కింపు కేంద్రాలను సందర్శించిన అధికారులు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 12, (తెలంగాణ దిశ)** :మున్సిపల్ ఎన్నికల లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడు చింతలపల్లి, ఆలియాబాద్ ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఓట్ల లెక్కింపు కోసం అలియాబాద్ మున్సిపాలిటీకి సంబంధించిన మజీద్ పూర్ లోని చైతన్య హైస్కూల్ లో, మూడు చింతలపల్లి మున్సిపాలిటీకి సంబంధించిన జగన్ గూడలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ లో, ఎల్లంపేట్ మున్సిపాలిటికి సంబంధించి బైబిల్ కాలేజీలలో 14 టేబుళ్లతో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ఒక్కొక్క టేబుల్ కు ఒక సూపర్ వైజర్, ఇద్దరు అసిస్టెంట్లతో కలిపి మొత్తం 153 సిబ్బందితో ఉదయం 8 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. లెక్కింపు ప్రక్రియ మొత్తం సిసి కెమెరాల పర్యవేక్షణలో గట్టి బందోబస్తు మధ్య నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజల ప్రశాంతతకు ఎటువంటి భంగం వాటిల్లకుండా, ముందస్తు భద్రతలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండడానికి లెక్కింపు కేంద్రాల పరిసర ప్రాంతాలలో 500 మీటర్ల రేడియస్ లోపల ఐదుగురికి మించి గుమ్మిగూడ రాదని తెలిపారు. నిబంధనలు అతిక్రమించినట్లయితే చట్టరీత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు.



# కేటీఆర్‌తో చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికలపై సమీక్ష

## - బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వరరెడ్డి మర్యాద పూర్వక భేటీ





**హైదరాబాద్, ఫిబ్రవరి 12, (తెలంగాణ దిశ)** :హైదరాబాద్ నందినగర్‌లోని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల కో–ఆర్డినేటర్ చింతల వెంకటేశ్వర రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన చౌటుప్పల్, భువనగిరి, పోచంపల్లి మున్సిపాలిటీ ఎన్నికలపై గంటపాటు సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఎన్నికల పోలింగ్ సరళి, ప్రజల స్పందన, పార్టీ బలాబలాలు, స్థానిక అంశాలు తదితర విషయాలను కేటీఆర్‌కు వారు వివరించారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు ప్రజల నుంచి అనుకూల స్పందన లభించిందని, క్షేత్రస్థాయిలో బిఆర్ఎస్ బలంగా ఉందని నేతలు కేటీఆర్‌కు వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషి చేస్తే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్ సూచనలు, మార్గ దర్శకత్వంతో ముందుకు సాగుతూ పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

# రెజ్లింగ్ పోటీల ప్రథమ విజేత అరవింద్ కు అభినందనలు

## - టి సాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 12 (తెలంగాణ దిశ)** :రెజ్లింగ్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని సాధించిన అర్కపల్లి అరవింద్ ను టి సాట్ సీఈఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి అభినందించారు. జూబ్లీహిల్స్ లోని టి–సాట్ కార్యాలయానికి వచ్చిన అరవింద్ సీ ఈవో వేణుగోపాల్ రెడ్డి ఆశిస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా అరవింద్ ను సీఈఓ శాలువా కప్పి సన్మానించి అభినందించడంతో పాటు తక్షణ సహాయం అందించారు. భవిష్యత్ లో పాల్గొనే పోటీలకు ప్రభుత్వ పరంగా తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. మారు మూల గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన అర్కపల్లి సైదులు కుమారుడైన అరవింద్ (15) రెజ్లింగ్ పోటీల్లో మొదటి స్థానం పొందడం రాష్ట్రానికే కాకుండా ఉన్న ఊరికి, కన్న తల్లికి మంచి పేరు తెచ్చిపెట్టాడని అభినందించారు. 19వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో ఈ నెల ఎనిమిదవ తేదిన ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లో జరిగిన రెజ్లింగ్(కుస్తీ) పోటీల్లో విజేతగా నిలువగా వరంగల్ జిల్లాకు చెందిన విద్యార్థి ద్వితీయ స్థానం సంపాదించాడు. పదవ తరగతి చదువుతున్న అరవింద్ ఇప్పటికే జిల్లా, మండల స్థాయిలో పలు పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. టి సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తమ గ్రామానికి చెందిన విద్యార్థిని వెన్ను తట్టి ప్రోత్సహించడం పట్ల గ్రామానికి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు.



# ఘనంగా ఇంటర్ కాలేజీయేట్ కల్చరల్ కాంపిటీషన్ కళా క్షేత్ర



**ఉప్పల్, ఫిబ్రవరి 12, (తెలంగాణ దిశ) :**
ఇంటర్ కాలేజీయేట్ కల్చరల్ కాంపిటీషన్ కళా క్షేత్ర కార్యక్రమం ఉప్పల్ లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఫోటోషూట్, మెహిందీ, నేల్ ఆర్ట్, పెన్సిల్ స్కెచ్, రంగోలి తదితర వివిధ అంశాలలో కాంపిటీషన్స్ నిర్వహించారు.
ఇందులో మల్లాపూర్ సెయింట్ ఆన్స్ కళాశాలలో బిఎస్ సీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ చదువుతున్న మెరుగు భవిష్యకు ఫోటోషూట్ లో బహుమతి లభించింది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం భవిష్యను అభినందించింది. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# భారత ప్రామాణిక కాలమానం అమలు

1906, జనవరి 1 నుండి భారతదేశంలో ఏకైక ప్రామాణిక సమయం అమలు కావడం ప్రారంభం అయింది. భారత దేశంలో అమలులో ఉన్న భిన్నాంశ కాలమానాన్ని ఖగోళకారుడు జాన్ గోల్డింగ్‌హామ్ స్థాపించాడని భావిస్తారు. భారత ప్రామాణిక కాలమానం భారతదేశమంతటా పాటించే సమయం. ఇది గ్రీన్‌విచ్ సమయానికి ఐదున్నర గంటలు ముందు ఉంటుంది. బ్రిటీషు నావికుడు–ఖగోళకారుడు మైఖెల్ టాపింగ్ కృషి ఫలితంగా 1792లో, బ్రిటీషు ఈస్టిండియా కంపెనీ అప్పటి మద్రాసులో మద్రాసు అబ్జర్వేటరీని ప్రారంభిం చింది. 1802లో భారత దేశంలో ఈస్టిండియా కంపెనీ అధికారిక ఖగోళ కారునిగా నియమితుడైన జాన్ గోల్డింగ్‌హామ్, గ్రీన్‌విచ్ ప్రామాణిక సమయానికి ఐదున్నర గంటలు ముందున్న మద్రాసు రేఖాంశంను స్థానిక ప్రామాణిక సమయంగా స్థిర పరిచాడు. దీనితో ప్రస్తుతము ఉపయోగిస్తున్న ప్రమాణిక సమయానికి అది ప్రాతిపదిక అయింది. అప్పటి వరకు ప్రామాణికంగా ఉపయోగిస్తున్న సమయంలో రోజు సూర్యోదయంతో ప్రారంభ మయ్యేది. అయితే కొత్త పద్ధతిలో రోజు అర్ధరాత్రి ప్రారంభ మవుతుంది. బొంబాయి నౌకాశ్రయములో నౌకా కార్యకలపాలకు సమయ పాలనా మద్దతును 1862లో స్థాపించబడిన కొలాబా అబ్జర్వేటరీ అందించేది. చరిత్రలో మొట్టమొదటగా ప్రామాణిక సమయం వివరణ భారతదేశంలో 4వ శతాబ్దపు భారతీయ ఖగోళశాస్త్ర ఆధారిత సూర్య సిద్ధాంతంలో ఇవ్వబడింది. దీనిలో భూమి గుండ్రంగా ఉందని ప్రతిపాదిస్తూ, ప్రైమ్ మెరీడియన్ లేదా "జీరో డిగ్రీల రేఖాంశం" అవంతీ నగరం ( ఉజ్జయినికి (23ళీ10ః58?చీ 75ళీ46ః38జు / ?23.18278ళీచీ 75.77722ళీ), పూర్వపు పేరు) , రోహితక ( కురుక్షేత్ర యుద్ధభూమి దగ్గరలోని నగరం రోహ్‌తక్) (28ళీ54ః చీ 76ళీ38ఃజు/ ?28.900ళీచీ 76.633ళీజు) గుండా వెళుతుందని నిర్వచించ బడింది. రోహితక, అవంతి నగరాలు (భూమధ్యరేఖ, 76ళీ తూ) , దేవతల ఆవాసమైన కైలాస పర్వతం (ఉత్తర ధృవం) గుండా వెళుతున్న సరళ రేఖపై ఉన్నాయి.సాధారణ ఉపయోగములో ఉన్న సమయమే గణించగల సమయము. ప్రాణంతో (ఒక శ్వాసకు పట్టే సమయం) ప్రారంభమై, ఆరు ప్రాణాలు ఒక విఘటిక లేదా పలం, 60 విఘటికలు ఒక ఘటిక, 60 ఘటికలు ఒక నక్షత్ర అహోరాత్రి, లేదా ఒక ఖగోళ దినంగా గణిస్తారు. ఒక నక్షత్ర మాసం లేదా ఖగోళ మాసంలో 30 అహోరాత్రులు లేదా రోజులు ఉంటాయి. ఒక రోజుకు 24 గంటలుగా పరిగణిస్తే, ఈ కాలమానంలోని అత్యంత చిన్న కొలత, ప్రాణం, లేదా ఒక ఉచ్ఛ్వాసనిశ్వాసం నాలుగు సెకన్లకు సమానమవుతుంది. ఇది ఆధునిక వైద్యశాస్త్ర పరిశోధనలు సాధారణ ఉచ్ఛ్వాసనిశ్వాస పౌనపున్యంగా భావించే నిమిషానికి 15 శ్వాసలకు సరిపోతుంది. సూర్య సిద్ధాంతం, స్థానిక సమయము నుండి ఉజ్జయినీ ప్రామాణిక సమయాన్ని గణించే పద్ధతిని కూడా వివరించింది. భారతీయ కాలమానం చాలా ముందే ఈ ప్రగతిని సాధించినప్పటికీ, ప్రామాణిక సమయం, ఖగోళ శాస్త్రంలో తప్ప వేరెక్కడా విరివిగా ఉపయోగించబడలేదు.భారతదేశాన్ని పరిపాలించిన రాజులు, తమ సామ్రాజ్యాలలో, చాలా వరకు భారతీయ పంచాంగం సహాయముతో గణించిన స్థానిక సమయాన్నే పాటించారు.పూర్వపు భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞులు ఉపయోగించే రోజు ఉజ్జయిని లోని ప్రైమ్ మెరీడియన్ వద్ద సూర్యుడు ఉదయించ డముతో ప్రారంభ మవుతుంది. అలా ప్రారంభ మయిన

# బయో ఫ్యూయెల్‌కు ప్రోత్సాహం నిల్...



మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్థాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలా ఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగ పడుతున్నది. మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నో రకాల ఘన, ద్రవ, వాయు ఇంధనాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు నిత్య జీవితంతో పెన వేసుకుని పోయాయి. నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగ పడుతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణు ఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు. అవసరాలకు మించి వినియోగం చేస్తూ పోతే, భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతాం. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గుతాయి కాని పెరగవు. 19వ శతాబ్ది నుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరిగి పోయింది. పరిశ్రమల్లో బాయిలర్లలో, థర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్లను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి, తరిగి పోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజనిల్వలు తరిగి పోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్ళి మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడ వలసి వుంటుంది. కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ. జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలు ఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహాలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్ గా పరివర్తించి,10% వరకు డీజిల్‌లో కలిపి డిజిల్‌ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. డీజిల్‌తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం యొక్క కార్బోరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్‌ను వాడవచ్చును. అలాగే డీజల్‌తో నడిచే రైలు ఇంజనులలో బయోడిజిల్‌ను వాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించ వచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450ళీ%జ%వద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడుతుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన / ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్, కార్బన్ మొనాక్సైడ్, మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడుతాయి. ఈ వాయువులను కండెన్సరు/ద్రవీకరణకారి లోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడుతుంది. భారత గత యూపీఏ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయం తగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది. ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటి పోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గుపులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు. శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయో డీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం: పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోటా) గింజలనుండి తీసే నూనె. బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా, అది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనెబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. బంజరు భూములు అధికంగాగల భారతావనిలో జీవ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి. గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేణ్ణీళ్ళకు చన్నీ ళ్ళ తోడు లాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్ళ వరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడ పీడల నివారణి అయినందున దానిపై ఎటువంటి చీడ పీడలుండవు. నరేంద్ర మోడీ గత ప్రభుత్వం ఇటీవలి కాలంలో పునరుత్పాదక ఇంధన పథకాలకు విశేష కృషి చేసింది. స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి, అవి అందుబాటు యోగ్యంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇచ్చింది. దేశంలో సులభతర వాణిజ్య నిర్వహణకు ఎంతో చేయూత అందిస్తున్నది. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సదుపాయంగా ఉండేలా, అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి విభాగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విభాగాలను ఏర్పాటు చేసింది. ఇంధన పేదరికాన్ని అంతం చేసే దిశగా, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి మార్గ నిర్దేశం చేసింది. స్వచ్ఛందంగా శిలాజ ఇంధన వినియోగం, స్వదేశీ ఇంధనాలపై మరింత ఎక్కువగా ఆధారపడటం, విద్యుత్ సేవలను పెంచడం, తాజాగా ఆవిర్భవిస్తున్న హైడ్రోజన్ వంటి ఇంధనాలవైపు మరలడం, అన్ని ఇంధన వ్యవస్థల్లో డిజిటల్ సృజనాత్మక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకృతం చేసింది.

# సూక్ష్మ చిత్రకళతో అద్భుత రూపాలు





కుక్కపిల్ల.. సబ్బుబిళ్ల.. కాదేదీ కవితకు అనర్హం అన్న శ్రీశ్రీ మాటలు ఆమె సూక్ష్మకళీరూపంలో ప్రతిబింబిస్తాయి. బాదంపప్పుపై భారతదేశం, జీడిపప్పుపై జాతీయజెండా.. విత్తనాలపై విస్మయపర్చే విన్యాసాలు.. వందలాది పదార్థాల ఎంపిక.. ఇలా 250కు పైగా కళాకృతులు సృష్టించారామె. 70 పప్పులపై 70 మంది స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు రాశారు. పుచ్చగింజను త్రివర్ణ పతాకంగా చెక్కారు. మందుబిళ్ల.. జొన్న గింజ, జమ్మి ఆకు కాదేది కళకు అనర్హమంటారామె. ఈ సూక్ష్మచిత్ర అద్భుత చిత్రకారిణి పేరు నడుకుదిటి సుజాత. తెలంగాణ రాష్ట్రం బోనకల్లు మండలం పాలడుగు గ్రామానికి చెందిన సైకం అంకరాజు, ధనలక్ష్మి దంపతుల కుమార్తె నడుకుదిటి సుజాత. ఆమె భర్త నడకుదురు ఆదిశేషవర్మ రవాణాశాఖలో ఇన్‌స్పెక్టర్. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం యనమలకుదురులో ప్రస్తుతం నివాసం ఉంటున్నారు. సుజాతకు చిన్నప్పటి నుంచి కళలంటే ఇష్టం. కోలాటం అలవోకగా ఎంతో చక్కగా చేస్తుంటారు. ఏదో సరదాగా చేసిన చిన్నపాటి పెయింట్ ఆ తర్వాత దానిని అభివృద్ధి చేసుకోగా, అద్భుత కళాకారుణిగా నేడు ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందారు. జాతీయజెండాలు, వందమాతరం సందేశాలు, జాతీయ నేతల ఫొటోలను వివిధ పదార్థాలతో ఆమె సూక్ష్మకళతో తీర్చిదిద్దుతున్నారు. అత్యద్భుత కళాకృతులను చిత్రీకరించి అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు.

ఏకాగ్రతతో ఊపిరి బిగబట్టడం: మైక్రోఆర్ట్స్ కళ గురించి తెలుసుకుంటూ తాను కూడా అందులో రాణించి గుర్తింపు తెచ్చుకోవాలని భావించి కృషిని కొనసాగిస్తున్నారు సుజాత. స్వాతంత్ర్య దినోత్సవం, వివిధ పండుగలు, క్రికెట్ మ్యాచ్‌లు ఇలా సందర్భాన్ని బట్టి కోడిగుడ్లపై బొమ్మలు గీస్తూ వస్తున్నారు. గత పదేళ్లుగా ఆమె ఈ సూక్ష్మకళను కొనసాగిస్తున్నారు. సూక్ష్మవస్తువులపై కళను చిత్రీకరించేటప్పుడు ఊపిరి ఆపుకోవాలి. పీల్చాలనుకు న్నప్పుడు కళను ఆపేయటం చేయాలి. ఇది చాలా ఏకాగ్రతతో కూడుకున్న పని. అలాంటిది ఆమె పుచ్చకాయ, కొబ్బరిబోండాం, కొబ్బరికాయ, కురిడీకా య, కోడిగుడ్లు, బల్లిగుడ్లు, సేమియా, మందుబిళ్ల, అనేక రకాలైన కూరగాయల గింజలు, జొన్నలు, గసగసాలు, సజ్జలు, కొర్రలు, పుట్నాల పప్పు, ఉసిరి, జమ్మి ఆకు వంటిపై పలు రకాల ఆకృతులను తీర్చిదిద్దారు. పుచ్చకాయలో మూడు రంగులను జెండాలాగా చెక్కారు. ఒక్కొక్క పళ్లకుట్టుకునే పుల్ల (టూత్‌పిక్)పై వందేమాతరం, జనగణమన, మా తెలుగుతల్లికి మల్లె పూదండ, దాశరథి గారి 'ఆ చల్లని సముద్ర గర్భం' పాటలు రాశారు. 70వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 70 పుట్నాల పప్పులపై 70 మంది స్వాతంత్య సమరయోధుల పేర్లు రాసి 70 ఆకారంగా అతికించారు. దేశభక్తికి ప్రతిరూపం: 76వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 76 రకాల విత్తనాలను సేకరించి వాటిపై భారతదేశ పటాన్ని చిత్రించారు. పనస, బాదం, జీడిపప్పు. కరక్కాయ వంటి పెద్ద గింజలతో పాటు నువ్వులు, సజ్జలు, రాగులు, గసగసాలు లాంటి చిన్న గింజలతో భారతదేశ పటాన్ని తయారుచేసి సృజనాత్మకతను చాటుకున్నారు. మన జాతీయ జెండాలోని మూడు రంగులను పుచ్చకాయలో ఆవిష్కరించారు. ఏటేటా స్వాతంత్ర్య దినోత్సవం నాడు చార్టులపైనా, చిన్నవస్తువులపైన భారతీయ చిత్రపటాన్ని గీసి దేశ గొప్పతనాన్ని తెలుపుతుంటారు. అలాగే వివిధ క్రికెట్ పోటీల్లో పాల్గొనే భారత్ జట్టుకు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తూ కోడిగుడ్డుపై శుభాకాంక్షలు తెలియజే స్తుంటారు. మనదేశానికి చెందిన క్రీడాకారులు ఏ క్రీడలో విజయం సాధించినా ఆమె ఇలాంటి కృషినే కొనసాగిస్తుంటారు. పాత నాణేల సేకరణ: పాత నాణేలనే సేకరించటం సుజాత మరొక హాబీ. కరెన్సీ నోట్లపై ఉన్న నంబర్లలో బంధువులు, స్నేహితుల పుట్టిన రోజు, పెళ్లిరోజులను గుర్తించి వాటిని బహుమతిగా ఇస్తుం టారు. కుటుంబ సభ్యుల సహకారంతో వందలాది దేశ విదేశాలకు చెందిన కరెన్సీనోట్లను సేకరించారు. అంతరించిపోయిన, ప్రస్తుతం వాడుకలో లేని భారత కనెర్సీ నోట్లు ఆమె దగ్గర ఉన్నాయి. రూపాయి నుంచి రెండు వేల రూపాయల నోటు వరకూ ఆమె భద్రపర్చారు. 250 వరకూ అరుదైన నాణేలు ఆమె వద్ద ఉన్నాయి. ఆమె గీచిన చిత్రాలు, తయారుచేసిన అరుదైన ఆకృతులకు గుర్తింపుగా ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, నోబుల్ వరల్డ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆప్ రికార్డులో నోటుదక్కింది. పలు ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు ఆమెను పలు వేదికలపై ఘనంగా సత్కరించాయి. సూక్ష్మకళ కోసం నేనేమీ శిక్షణ తీసుకోలేదు. సమాజంలో కొంతమంది ఈ కళలో రాణిస్తున్నారని తెలుసుకున్నా. నేను కూడా ఏదో ఒకటి చేయాలని ప్రయత్నించా.

గత పదేళ్లుగా ఇదే కృషిని కొనసాగిస్తున్నా. దేశం కోసం,సమాజం కోసంపనిచేసే ప్రముఖుల ఆకృతులను తీర్చిది ద్దుతున్నా. జాతీయ జెండా, వందేమాతరం గొప్పతనాన్ని సూక్ష్మకళ ద్వారా ప్రపంచానికి తెలియ జేస్తున్నా. ఈ కృషిలో నా కుటుంబ సభ్యుల నుంచి మంచి ప్రోత్సాహం, సహకారం ఎంతో ఎంతో ఉంది.

## ఇండోర్ ఘటన కనువిప్పుకావాలి

ఏమాత్రం ఆలోచన ఉన్నవారైనా సరే, మంచినీళ్ల పైప్‌లైన్ మీద మరుగుదొడ్డి కడతారా? ఇంటింటికీ సరఫరా అయ్యే నీటిలో మురుగు నీరు వచ్చిన కలుస్తుంటే అధికారులు ఏం చేస్తున్నట్లు? అలా కట్టిన మరుగుదొడ్డి గుంత నుంచి పెల్లుబికిన వ్యర్థ జలాలు, ఆ టాయిలెట్ కింద నుంచి వెళ్తున్న ప్రధాన తాగునీటి పైప్‌లైన్‌లో కలవడంతో ఇండోర్‌లో విషాదాన్ని మిగిల్చింది. జీవితాన్ని సంతోషంగా గడపాలంటే ముందు ఆరోగ్యం బాగుం డాలి. ఊరికే జబ్బు పడకూడదంటే జనావాసాల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా ఉండడంతో పాటు ప్రతిఒక్కరూ సురక్షితమైన తాగునీటికి నోచుకోవాలి. ఈ రెండు కరువైన చోట రోగాలు విజృంభించి అకా ల మరణాలకు మూలమవుతాయి. మన దేశంలో చాలా మందికి కనీసం మంచినీరు అందించలేని పరిస్థితుల్లో చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఉండడం ఆలోచించాల్సిన విషయం. ఒక పక్క భారత్ త్వరలో ప్రపంచంలోనే అతిపెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుంది అని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ సరైన తాగునీటి కోసం కొట్లాడుతున్న పరిస్థితి కానీ, తాగునీటికి సరైన వసతి లేని గ్రామాలు, పట్టణా లు ఇప్పటికీ దేశంలో చాలానే ఉన్నాయి. దేశంలో దాదాపు ప్రతీ ఏటా 37.7 మిలియన్ల మంది నీటి సంబంధించిన వ్యాధు లతో కాలగర్భంలో కలిసిపోతున్నట్లు తెలుస్తోంది. సగటున దేశంలో రోజూ 585 మంది కలుషిత నీరు తాగడం వలన, నీటి సంబంధించిన వ్యాధులతో మరణిస్తున్నారు అని పలు నివేదికలు పేర్కొంటు న్నాయి. ఇటీవల కాలంలో మహారాష్ట్ర, కర్ణాటక, కేరళలో వరుసగా కలుషిత నీటి ఉదంతాలు చోటుచేసుకోగా తాజాగా స్వచ్ఛ నగరంగా పేరు పొందిన ఇండోర్‌లోని భగీరథ్‌పుర ప్రాంతంలో కలుషిత నీరు తాగడం వల్ల సుమారు 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ప్రజల ప్రాణాలకు కలుషిత వ్యర్థాలతో ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా చూసే బాధ్యత ప్రభుత్వాలేదనని గుర్తు చేస్తూ ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభ 2010లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన పరిసరాలను మానవ హక్కుల్లో అంతర్భాగంగా గుర్తించింది. కానీ నిర్లక్ష్యంలో తేలియాడుతున్న అధికార యంత్రాంగం కారణంగా వ్యక్తిగత, గృహావసరాలకు తగినంత మంచినీటిని నిరం తరం పొందే హక్కు జన

భారతానికి ఉన్నా లేనట్లుగానే అనిపిస్తున్నది. వరుసగా ఎనిమిదేళ్లపాటు దేశంలోనే శుభ్రమైన నగరంగా పురస్కారాలు పొందిన ఇండోర్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే.. చెత్త, మురుగునీటికి ఆవాసాలుగా పేరు పడ్డ హైదరాబాద్, విజయవాడ, వైజాగ్, తిరుపతి, తదితర నగరాల పరిస్థితి ఏమిటనేది ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. ఏటా 3.77 కోట్ల మంది భారతీయులు కలుషిత నీళ్లలో నుంచి పురుడు పోసుకునే జబ్బుల బారినపడుతున్నారు. 15 లక్షల మంది పిల్లలు డయేరియాతో చనిపో తున్నారు. జల కాలుష్యంతో ప్రజల అనారో గ్యం దెబ్బతింటుండడంతో దేశం ఏడాదికి 7.3 కోట్ల పనిదినాలను నష్టపోతుంది. దానివల్ల భారత్‌కు సంవత్సరానికి 60 కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం సంభవిస్తోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ నేటికీ అందరికీ కనీసం విద్య, వైద్యం అందుబాటులో లేదు. అక్షరాస్యత అంతంత మాత్రంగానే ఉంది.

## సిటీ చుట్టూ రేడియల్ రింగ్



హైదరాబాద్, : హైదరాబాద్ తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జలమండలి 8 వేల కోట్ల రూపాయలతో భారీ ప్రాజెక్టును సిద్ధం చేస్తోంది. నగరం చుట్టూ సుమారు 140 కిలోమీటర్ల మేర 'రేడియల్ రింగ్ మెయిన్' పేరుతో ప్రధాన పైపులైన్ వ్యవస్థను నిర్మించనున్నారు. కృష్ణా, గోదావరి, మంజీరా వంటి అన్ని నీటి వనరులను ఈ రింగ్ మెయిన్‌తో అనుసంధానం చేస్తారు. దీనివల్ల ఏదైనా ఒక ప్రాంతంలో పైపులైన్ పాడైతే.. మరో మార్గం ద్వారా నీటిని మళ్లించి సరఫరాకు అంతరాయం లేకుండా చేయవచ్చు. నగరమంతటా 24 గంటల పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తోంది. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా.. నగరంలోని ఏ ఒక్క ప్రాంతంలోనూ నీటి కరువు లేకుండా చూడాలని జలమండలి నడుం బిగించింది. దీని కోసం సుమారు 8 వేల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో ఒక ప్రత్యేకమైన తాగునీటి ప్రాజెక్టును సిద్ధం చేస్తోంది. నగరానికి నలుదిశల నుండి వచ్చే నీటి వనరులను ఒకదానితో ఒకటి కలిపేలా ఒక భారీ నెట్‌వర్క్‌ను నిర్మించడమే ఈ ప్లాన్ ముఖ్య ఉద్దేశం. సాధారణంగా నగరానికి ఒక్కో వైపు నుండి ఒక్కో నది లేదా రిజర్వాయర్ నీరు వస్తుంది. అయితే.. ఏదైనా ఒక పైపులైన్ పాడైతే ఆ ప్రాంతానికి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోతుంది. ఇలాంటి సమస్య రాకుండా ఉండటానికి, నగరం చుట్టూ సుమారు 140 కిలోమీటర్ల మేర ఒక పెద్ద రింగు లాంటి ప్రధాన పైపులైన్‌ను ఏర్పాటు చేస్తారు. దీనినే 'రేడియల్ రింగ్ మెయిన్' అని పిలుస్తారు. దీనికి అదనంగా మరో 96 కిలోమీటర్ల మేర చిన్న పైపులైన్ల ద్వారా నగరంలోని వివిధ వాటర్ ట్యాంకులకు కనెక్షన్ ఇస్తారు. ప్రస్తుతం హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి నదులతో పాటు సింగూరు, మంజీరా.. జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నుంచి తాగునీరు అందుతోంది. ఈ కొత్త ప్రాజెక్టు వల్ల ఈ నీటి వనరులన్నీ ఒకే వ్యవస్థతో అనుసంధానం అవుతాయి. ఉదాహరణకు మంజీరా పైపులైన్‌కు రిపేర్లు వస్తే.. వెంటనే అదే రింగ్ మెయిన్ ద్వారా గోదావరి లేదా కృష్ణా జలాలను ఆ ప్రాంతానికి మళ్లించవచ్చు. నగరం చివరన ఉన్న ప్రాంతాలకు కూడా సమానమైన నీరు అందుతుహైదరాబాద్ ప్రజలకు రోజులో ఎప్పుడైనా నీరు వచ్చేలా (24/7 నీటి సరఫరా) చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే రింగ్ మెయిన్ వ్యవస్థ ఎంతో అవసరం. రాబోయే రెండేళ్లలో గోదావరి రెండు, మూడు దశల పనులు కూడా పూర్తవుతాయి. ఆ నీటిని కూడా ఈ రింగ్ మెయిన్‌కు కలిపితే.. భవిష్యత్తులో నీటి ఎద్దడి అనే మాట వినిపించదు. పాత పైపులైన్లు తరచూ పగిలిపోవడం వల్ల నీరు వృథా కావడమే కాకుండా... మరమ్మతులు చేసే వరకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి ఈ కొత్త పైపులైన్లు వేయడం వల్ల నిర్వహణ కూడా సులభం అవుతుంది. ఈ భారీ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ తాగునీటి అవసరాలకు రాబోయే 50 ఏళ్ల వరకు ఎటువంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు.

## హైదరాబాద్‌లో 'ట్రౌట్' చేపల సాగు కేంద్రం

రంగారెడ్డి,: హైదరాబాద్ శివారులో రెయిన్‌బో ట్రౌట్ చేపల పెంపకానికి సరికొత్త అధ్యాయం మొదలైంది. దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి భారీ స్థాయి రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ ఆధారిత ఫారమ్‌ను కేంద్ర మంత్రి ప్రారంభిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతతో వేడి వాతావరణంలోనూ శీతల నీటి చేపల పెంపకాన్ని ఇది సాధ్యం చేస్తుంది. గ్రామీణ యువతకు శిక్షణతో పాటు ఉపాధి అవకా శాలు మెరుగుపడతాయి. మత్స్య పరిశ్రమలో సరికొత్త అధ్యాయానికి హైదరాబాద్ వేదికవుతోంది. సాధారణంగా హిమాలయాలు, శీతల పర్వత ప్రాంతాలకే పరిమితమైన 'రెయిన్‌బో ట్రౌట్' చేపలను.. ఇప్పుడు దక్షిణ భారతదేశపు ఉష్ణమండల వాతావరణంలో పెంచబోతున్నారు. దేశంలోనే మొట్టమొదటి భారీ స్థాయి రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ ఆధారిత రెయిన్‌బో ట్రౌట్ ఫారమ్‌ను కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ రేపు (జనవరి 5) ప్రారంభించనున్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో స్మార్ట్ గ్రీన్ ఆక్వాకల్చర్ లిమిటెడ్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు చేపల సాగు అనేది ఆయా ప్రాంతాల వాతావరణంపై ఆధారపడి ఉండేది. కానీ ఈ ప్రాజెక్ట్ ఆ అంచనాలను తలకిందులు చేసింది.

అత్యాధునిక ప్రెసిషన్ ఇంజనీరింగ్ , నీటిని నిరంతరం శుద్ధి చేసే వాటర్ రీసర్క్యులేషన్ సాంకేతికతతో హైదరాబాద్ వంటి వేడి వాతావరణంలో కూడా ఏడాది పొడవునా శీతల నీటి చేపలను పెంచవచ్చని ఈ సంస్థ నిరూపించింది. వాతావరణం కంటే సాంకేతికతే సాగుకు ప్రాధాన్యతనిస్తుందని ఈ కేంద్రం చాటిచెప్పనుందికేవలం ఉత్పత్తి కేంద్రంగానే కాకుండా పరిశోధనా సంస్థగా కూడా పనిచేయనుంది. గ్రామీణ యువతకు, విద్యార్థులకు ఆటోమేషన్, బయోసెక్యూరిటీ, ఆధునిక ఆక్వాకల్చర్ పద్ధతులపై ఇక్కడ ప్రత్యక్ష శిక్షణ ఇస్తారు. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా, నూతన పారిశ్రామికవేత్తలు తయారయ్యే

అవకాశం ఉంది. మత్స్య రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2015 నుండి ఇప్పటివరకు సుమారు రూ. 38,572 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా కోల్డ్ వాటర్ ఫిషరీస్‌కు అంతర్జాతీయ మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్ వంటి రాష్ట్రాలకే పరిమితమైన ఈ సాగును ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నారు. ప్రస్తుతం ఏటా 14 లక్షల ట్రౌట్ విత్తనాల ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. మత్స్య రంగాన్ని కేవలం జీవనోపాధిగానే కాకుండా, ఒక సాంకేతిక ఆధారిత ఎగుమతి రంగంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం. ఉత్తరాఖండ్ ప్రభు త్వం ఇప్పటికే ఐటీబీపీతో ఒప్పందం చేసుకుని సరిహద్దు గ్రామాల్లో ఈ చేపల సరఫరాను ప్రోత్సహిస్తోంది. అదేవిధంగా జమ్మూ కాశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లో ఫిషరీస్ క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నారు. హైదరా బాద్‌లో ప్రారంభం కానున్న ఈ సరికొత్త సాగు కేంద్రం, భవిష్యత్తులో దేశీయంగా చేపల వినియోగాన్ని పెంచడమే కాకుండా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడంలో కీలక పాత్ర పోషించనుంది.

## బస్సు డ్రైవర్... దేశాధ్యక్షుడు ఎలా అయ్యారు..

న్యూఢిల్లీ: వెనిజుల అధ్యక్షుడిని అమెరికా అరెస్ట్ చేసింది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అదే కాదు, మదురో ను అరెస్ట్ చేసిన ఫోటోలను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. అమెరికా సైన్యం విజయవంతమైన పని చేస్తుందని అందులో రాసుకొచ్చారు. మదురో ను అరెస్టు చేసి జైలుకు తీసుకెళ్తున్న ఫోటోలు ట్రంప్ పోస్ట్ చేయడంతో సోషల్ మీడియాలో విస్తృతమైన చర్చకు దారితీస్తోంది. మదురో అరెస్ట్ తర్వాత వెనిజులా ప్రాంతంలో ఒక్కసారిగా పరిణామాలు మారిపోయాయి. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో అమెరికా ఏం చేస్తుంది? తనకు నచ్చిన వ్యక్తులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయిస్తుందా? ఉన్న ప్రభుత్వాన్ని తన చెప్పు చేతల్లో పెట్టుకొని.. తోలుబొమ్మ లాగా ఆడిస్తుందా.. ఈ ప్రశ్నలకు మరి కొద్ది రోజుల్లోనే సమాధానాలు లభిస్తాయి. మదురో ను అరెస్ట్ చేసిన తర్వాత అమెరికా సంబరాలు చేసుకుంటున్నది. వాస్తవానికి మదురో ఓవర్ నైట్ లో వెనిజులా దేశానికి అధ్యక్షుడు కాలేదు. అతడు చిన్న స్థాయి నుంచి తన జీవితాన్ని మొదలుపెట్టాడు. ఒక బస్సు డ్రైవర్ గా జీవితాన్ని ప్రారంభించాడు. ఆ తర్వాత రాజకీయాలలోకి వచ్చాడు. క్రమ క్రమంగా ఎదిగాడు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన.. వెనిజులా అధిపతి హ్యూగో చావెజ్ కు ప్రధాన అనుచరుడిగా మారిపోయారు. ఆ తర్వాత రాజకీయాలలో ఎదిగారు. చావెజ్ కన్ను మూసిన తర్వాత 2013లో వెనిజులా దేశానికి అధ్యక్షుడయ్యారు. అయితే ఆ దేశాన్ని ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టింది. ఇదే క్రమంలో మదురో మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. అమెరికాకు అక్రమంగా మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్నారని విమర్శలు వినిపించాయి. చివరికి అమెరికా మాదక ద్రవ్యాలను సాకుగా చూపించి.. వెనిజులా మీద దాడి చేసింది. మదురో ను అరెస్ట్ చేసింది. మదురో మొదటి నుంచి కూడా స్వయం ప్రతిపత్తి కల నాయకుడు. అనేక సందర్భాలలో అమెరికా ఆధిపత్యాన్ని ప్రశ్నించాడు. ఇది సహజంగానే అమెరికాకు కడుపు మంటగా మారిపోయింది. దీంతో సమయం కోసం ఎదురుచూసిన ఆ దేశం. మదురో కు చెక్ పెట్టింది. అనేక విషయాలలో ఆయనకు అడ్డు తగిలింది. చివరికి దేశం మీద దాడి చేసి.. సైన్యాన్ని మోహరించి.. అరెస్టు చేయించింది. మదురో ను అరెస్ట్ చేసిన తర్వాత.. అతడిని అమెరికా తన అదుపులో ఉంచుకుంటుంది. ఎన్నో రకాలుగా ఇబ్బంది పెట్టిన తర్వాతనే బయటికి విడుదల చేస్తుందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఒకవేళ విడుదల చేసినా.. సొంత దేశంలో అతడిని అనేక రకాలుగా ఇబ్బంది పెట్టి.. కాలగర్భంలో కలిపేలా చేస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

## మళ్లీ రేసులోకి ధర్మాన



శ్రీకాకుళం, : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యంత సీనియర్ రాజకీయ నాయకుల్లో ఒకరిగా ధర్మాన ప్రసాదరావు కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన రాజకీయ జీవితం దశాబ్దాల పాటు సాగింది. కాంగ్రెస్ పార్టీ లో దీర్ఘకాలం పనిచేసిన ఆయన, దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతో మరింత బలమైన నాయకుడిగా ఎదిగారు. 1989లో తొలిసారి శాసనసభలో అడుగుపెట్టిన ధర్మాన, అదే సమయంలో మంత్రి పదవిని కూడా దక్కించుకున్నారు. అప్పటి నుంచి కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ 2014 వరకు కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర విభజన తరువాత రాజకీయ పరిస్థితులు మారాయి. అనుకోని పరిణామాల మధ్య వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు ధర్మాన ప్రసాదరావు. కాంగ్రెస్‌లో ఉన్న సమయంలో జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకించినా, తర్వాత అదే నేత ఆధ్వర్యంలో పని చేయాల్సి వచ్చింది. పార్టీ మారిన తర్వాత కూడా ఆయన రాజకీయ అనుభవం కారణంగా వైసీపీలో ప్రాధాన్యం దక్కింది. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన పార్టీ నుంచి బయటకు వస్తారన్న ప్రచారం సాగింది. దానికి అనుగుణంగా దాదాపు ఏడాది పాటు ఆయన రాజకీయంగా మౌనంగా ఉండిపోయారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఇటీవల మాత్రం ధర్మాన మళ్లీ యాక్టివ్‌గా మారారు. ఈ మార్పు వెనుక కుమారుడి రాజకీయ భవిష్యత్తే ప్రధాన కారణమని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఆయన కుమారుడు రామ్ మనోహర్ నాయుడు కు సరైన రాజకీయ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ధర్మాన మళ్లీ రంగంలోకి దిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి, ధర్మాన ప్రసాదరావుకు కీలక బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధమవుతున్నారన్న వార్తలు చర్చనీయాంశంగా మారాయి. ఈ పరిణామాల మధ్య ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ( చేసిన వ్యాఖ్యలు రాజకీయ వేడిని పెంచాయి. ఆయన ధర్మాన సోదరులపై తీవ్ర ఆరోపణలు చేస్తూ, పార్టీని నాశనం చేస్తున్నారంటూ బహిరంగంగా విమర్శించారు. తన పరాజయాల వెనుక కొన్ని రాజకీయ కుటుంబాల పాత్ర ఉందని కూడా పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేస్తూ, ధర్మాన కుటుంబాన్ని నమ్మవద్దని కోరిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈ వ్యాఖ్యల అనంతరం దువ్వాడ శ్రీనివాస్ పార్టీ నుంచి సస్పెండ్ కావడం గమనార్హం. ఇప్పుడు అదే సమయంలో ధర్మాన ప్రసాదరావుకు మరింత ప్రాధాన్యం పెరగడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా లో ధర్మాన కుటుంబానికి ఉన్న పట్టు దృష్ట్యా, జగన్ వారి సేవలను వినియోగించుకోవాలని భావిస్తున్నారని సమాచారం.

# కీర్తి అందుకే నన్ను వదిలేసింది...

సీరియల్ నటి, బిగ్ బాస్ 6 కంటెస్టెంట్ కీర్తి భట్ తన ప్రియుడు కార్తీక్ తో బ్రేకప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా తాజాగా ఈ విషయంపై కార్తీక్ స్పందించారు. కీర్తి పోస్ట్ పెట్టిన తరవాత తనకు చాలా మంది ఫోన్ చేసి కీర్తిని వదిలేయవద్దని అడుగున్నారని చెప్పాడు. తను పెళ్లి చేసుకోవాలని అనుకున్నానని కానీ తనే విడిపోవాలని అనుకుందని చెప్పాడు. ఈ ఏడాది ఆమెను పెళ్లి చేసుకుని జీవితాన్ని పంచుకోవాలని తను, తన కుటుంబం కోరుకున్నామని అన్నాడు. తాను ఇంకా ఆర్థికంగా స్థిరపడలేదు అనే కారణం ఆమెకు నచ్చలేదని చెప్పాడు. డిసెంబర్ లోనే ఈ విషయం చెప్పి కీర్తి తన లైఫ్ తాను చూసుకుంటుందని అన్నాడు. ఎవరి జీవితం వాళ్లది కాబట్టి నిర్ణయం తీసుకునే హక్కు ఆమెకు కూడా ఉంటుందని కార్తీక్ చెప్పాడు. ఈ క్రమంలో ఆయన ఎమోషనల్ అయ్యాడు. ఇదిలా ఉంటే కొన్నేళ్లుగా కార్తీక్, కీర్తి రిలేషన్ షిప్ లో ఉన్నారు. కీర్తి బిగ్ బాస్ షోకు వచ్చిన సమయంలో తన ప్రియుడుగా కార్తీక్ ను పరిచయం చేసింది. 2023లోనే వీరిద్దూ నిశ్చితార్థం కూడా చేసుకున్నారు. తరవాత అంతా వీరు పెళ్లి చేసుకుంటారని అనుకుంటే బ్రేకప్ ప్రకటన చేసి బిగ్ బాస్ బ్యూటీ అందరికీ షాక్ ఇచ్చింది.




## లింగ సమానత్వంపై నటి షాకింగ్ రియాక్షన్



బాలీవుడ్ స్టార్ నటి రాణి ముఖర్జీ యాక్షన్ థ్రిల్లర్ 'మర్దానీ-3' మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అభిరాజ్ మినావాలా దర్శకత్వం వహించిన ఈ చిత్రం, బాలికల అపహరణ ముఠాపై శివాని పోరాటం చుట్టూ తిరుగుతుంది. ఇది యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మించిన మర్దానీ ఫ్రాంచైజీకి మూడవ భాగంగా వచ్చింది. ఇందులో రాణి ముఖర్జీ పవర్ ఫుల్ పోసీల్ ఆఫీసర్ శివానీ రాయ్‌గా నటించింది. ఈ మూవీ జనవరి 30న థియేటర్స్‌లోకి వచ్చింది. ఈనేపథ్యంలో ప్రమోషన్స్‌లో పాల్గొన్న రాణి ముఖర్జీ పలు వ్యాఖ్యలు చేసి చిక్కుల్లో పడింది. నిజజీవితంలో సమాజంలోని లింగ సమానత్వం గురించి మాట్లాడుతూ.. తండ్రి ప్రవర్తనే కొడుకు వ్యక్తిత్వాన్ని మలుస్తుందని చెప్పారు. ఇంట్లో తల్లిని తండ్రి గౌరవించకపోతే, అబ్బాయిలు బయట మహిళలను అలాగే చూస్తారని ఆమె చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీస్తున్నాయి.? వివాదం ఎక్కడ మొదలైందంటే.. భార్యాభర్తల సంబంధం గురించి చెబుతూ, "భర్త భార్యపై అస్సలు గొంతు పెంచకూడదని, నిజానికి భార్యే భర్తపై అరిచి మాట్లాడాలి..

అప్పుడే అంతా బాగుంటుంది" అని రాణి వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, తన భర్త ఆదిత్య చోప్రాను ఉద్దేశించి "ఇంట్లో ఆయన పరిస్థితి ఏంటో అడగకండి" అంటూ సరదాగా నవ్వేయడం గమనార్హం. "గౌరవం అనేది ఇంటి నుంచే మొదలవుతుంది. ఇంట్లో తల్లిని తండ్రి సరిగ్గా చూడకపోతే, బయట అమ్మాయిలను కూడా అలాగే చూడవచ్చని అబ్బాయిలు భావిస్తారు. కాబట్టి ఇంట్లో భార్యను గౌరవించే విషయంలో తండ్రులు బాధ్యతగా ఉండాలి. అప్పుడే సమాజంలో మహిళలకు దక్కాల్సిన హోదా ఏంటో అబ్బాయిలకు అర్థమవుతుంది" అని రాణి ముఖర్జీ పేర్కొన్నారు.

## అఘాయిత్యాలను చూస్తుంటే సిగ్గుతో తలవంచుకోవాల్సి వస్తోంది



దేశ రాజధాని ఢిల్లీలో చోటుచేసుకున్న అమానవీయ ఘటన యావత్ దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఆరేళ్ల పసిప్రాయం అని కూడా చూడకుండా ముగ్గురు మైనర్ బాలురు ఆ చిన్నారిపై సామూహిక అత్యాచారానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణ ఘటనపై పౌర సమాజం నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రక్షణ కల్పించాల్సిన చోటే చిన్నారులకు నరకం ఎదురవ్వడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.? తాజాగా ఈ ఘటనపై బాలీవుడ్ నటి భూమి ఫెడ్నెకర్ సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందించారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తన ఆవేదనను వెల్లడిస్తూ.. నేరస్థులకు చట్టాలన్నా, సమాజమన్నా భయం లేకుండా పోతోందని మండిపడ్డారు. పసి ప్రాణాలకు కనీస రక్షణ కల్పించడంలో మనం ఘోరంగా విఫలమవుతున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 10 నుంచి 14 ఏళ్లలోపు వయసున్న బాలురు ఇలాంటి దారుణానికి ఒడిగట్టడం మన విద్యా వ్యవస్థ, పెంపకం ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఫైర్ అయింది. ముఖ్యంగా దేశంలో వీధి కుక్కల సమస్యలపై గంటలు తరబడి చర్చలు జరుపుతున్న జనాలు.. అంతకంటూ క్రూరంగా ప్రవర్తించే మృగాల గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించింది. అలాగే మూగజీవాలను శిక్షించడానికి చూపించే ఆసక్తి ఆడపిల్లలకు రక్షణ కల్పించడంలో ఎందుకు కనపించదు? అని అన్నది. ఈశాన్య ఢిల్లీలోని భజన్‌పూర్‌లో జరిగిన ఈ ఘటన చిన్నారిని నిర్భందించి, నోట్లో గుడ్డలు కుక్కి హింసించడం అత్యంత దారుణం అని విమర్శించింది. మన చుట్టూ జరుగుతున్న ఇటువంటి అఘాయిత్యాలను చూస్తుంటే సిగ్గుతో తలవంచుకోవాల్సి వస్తోందని ఆమె తన పోస్ట్‌లో పేర్కొంది. ఢిల్లీలో జరిగిన ఈ ఘాతుకం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. భూమి ఫెడ్నెకర్ చేసిన పోస్ట్ వైరల్ కావడంతో, నెటిజన్లు సైతం దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. కేవలం చట్టాలు ఉంటే సరిపోదని, నేరస్థుల గుండెల్లో వణుకు పుట్టించేలా శిక్షలు ఉండాలని బాధితురాలి కుటుంబానికి అండగా పోస్టులు పెడుతున్నారు.

## అలరించే మెలోడి 'నీ మాయలో పడేట్టుగా...'



నరేష్ అగస్త్య హీరోగా నటిస్తున్న థ్రిల్లర్ 'అసురగణ రుద్ర'. సంగీర్తన విపిన్, ఆర్యన్ రాజేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మురళీ కాట్రాగడ్డ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

కమ్ముల ప్రొడక్షన్స్ పతాకంపై మురళి కమ్ముల, వంశీ కాంజుల నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ 'నీ మాయలో పడేట్టుగా' అనే సాంగ్‌ను రిలీజ్ చేశారు. శేఖర్ చంద్ర ఈ పాటను ఎంతో సున్నితంగా హృదయాన్ని తాకే బ్యూటీఫుల్ మెలోడీగా కంపోజ్ చేయగా, చైతు సత్సంగి అందించిన లిరిక్స్ పాటకు మరింత ప్రాణం పోశాయి. రమ్య బెహరా, సిద్ధార్థ్ మీనన్ వోకల్స్ మెలోడీని మరో స్థాయికి తీసుకెళ్లాయి.


కొత్తగా పెళ్లయిన జంట ప్రేమను సెలబ్రేట్ చేసే ఈ సాంగ్‌లో లీడ్‌పెయిర్ మధ్య కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మొత్తం మీద ఈ పాట మ్యూజిక్ లవర్స్ మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటోంది అని చిత్ర యూనిట్ తెలిపింది. రవివర్మ, శుభలేఖ సుధాకర్, ప్రియాంక శర్మ, ఆర్యన్ రాజేష్, అమిత్ శర్మ, దేవి ప్రసాద్, ఆమని, నిఖిల్ దేవదూల, బేబీ శ్రీదేవి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాతలు: సుధాకర రెడ్డి విప్పల, అప్పి రెడ్డి, డీఓపీ : అమర్‌నాథ్ బొమ్మిరెడ్డి, ఎడిటింగ్: శ్రీకాంత్ పట్నాయక్ ఆర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : శ్రీహరి గౌడ్, ప్రొడక్షన్ డిజైనర్: రఘు కులకర్ణి.

## నేరుగా నా మనసును తాకింది..



బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కూతురు రాషా తడాని ఒకేసారి అటు నటిగా, ఇటు సింగర్‌గా ఇండస్ట్రీలో సంచలనం సృష్టిస్తోంది. హిందీలో అభయ్ వర్మ హీరోగా నటిస్తున్న 'లైకీ లైకా' అనే రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ ద్వారా హీరోయిన్‌గా బాలీవుడ్‌కు పరిచయం అవుతోంది. ఈ చిత్రంలోని 'చాప్ తిలక్' అనే పాటతో రాషా సింగింగ్ డెబ్యూ ఇచ్చింది. సౌరభ్ గుప్తా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఈ ఏడాది సమ్మర్ స్పెషల్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక రాషా పాటకు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఫిదా అవ్వడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ప్రభాస్ స్పందిస్తూ.. "రాషా, నీ సింగింగ్ డెబ్యూ అద్భుతంగా ఉంది. నీ గొంతు నేరుగా మనసును తాకింది" అంటూ మనస్ఫూర్తిగా అభినందించారు. అది చూసిన రాషా కూడా "ప్రభాస్ సార్.. ఎప్పటికీ మీకు కృతజ్ఞురాలిని" అంటూ తన సంతోషాన్ని పంచుకుంటూ రెడ్ హార్ట్ సింబల్, దండం పెట్టే ఎమోజీని షేర్ చేసింది. ప్రస్తుతం ఈ రెండు పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. అది చూసిన నెటిజన్లు చర్చలు మొదలెట్టారు. రాషాకు పాటకు ఫిదా అయిన ప్రభాస్ తన తదుపరి ప్రాజెక్ట్‌లలో అవకాశం ఇచ్చే ఛాన్స్ ఉందంటూ నెట్టింట జోరుగా ప్రచారం సాగుతోంది. ?ఇక టాలీవుడ్‌లోనూ రాషా గ్రాండ్ ఎంట్రీకి సిద్ధమైంది. ఘట్టమనేని వారసుడు, మహేష్ బాబు మేనల్లుడు జయకృష్ణ సరసన 'శ్రీనివాస మంగాపురంలో' హీరోయిన్‌గా నటిస్తోంది. మాస్ డైరెక్టర్ అజయ్ భూపతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే భారీ అంచనాలను నెలకొల్పింది. అటు తెలుగు, ఇటు హిందీ సినిమాలతో పాటు సింగర్‌గానూ రాణిస్తున్న రాషా, అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగే సూచనలు కనిపిస్తున్నాయని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి రాషా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వకముందే.. తన పాపులారిటీని పెంచుకుంటోంది.

## పారిపోయి పెళ్లి చేసుకుందాం అనుకున్నాము



స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. 'నేను లోకల్' సినిమాతో తెలుగు ఆడియన్స్‌కు పరిచయమైన ఈ చిన్నది అనతి కాలంలోనే మంచి గుర్తింపు సంపాదించుకున్నది. అలా దాదాపు స్టార్ హీరోలందరి సరసన నటించి మెప్పించింది. ఇక 'మహానటి', 'దసరా' సినిమాలతో ఈ అమ్మడి రేంజ్ ఎక్కడికో వెళ్లిపోయింది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ సరసన రౌడీ జనార్ధన్ మూవీలో నటిస్తోంది. ఇక కీర్తి సురేష్ పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే.. తన చిన్ననాటి స్నేహితుడైన ఆంటోని తట్టిల్‌ని ప్రేమించి ఏడాది క్రితం డిసెంబర్ 12న వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఇక అప్పటి నుంచి ఈ జంట ఎంతో అన్యోన్యంగా ఉంటూ వేకేషన్స్‌కు తిరుగుతూ ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ చిన్నది కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఆమె మాట్లాడుతూ.. 'మేము 15 ఏళ్లు ప్రేమలో ఉన్నాం.. అయితే మా పెళ్లి అలా వైభవంగా జరుగుతుంది అనుకోలేదు. ఒకవేళ ఇంట్లో ఒప్పుకోక పోతే మేము పారిపోయి పెళ్లి చేసుకుందాం అనుకున్నాం కానీ వాళ్ళు అంగీకరించడంతో మా మ్యారేజ్ గ్రాండ్‌గా జరిగింది. కల నిజం అయినట్లు అనిపించింది. అందుకే మా వివాహ వేడుకలో ఎమోషనల్ అయ్యాను. ఆంటోని కూడా నమ్మలేకపోయాడు. అందుకే అతను కూడా ఎమోషనల్ అయ్యాడు. ఆంటోని కళ్లలో నీళు చూశాను ఇది ఒక అందమైన ప్రయాణం' అని చెప్పుకొచ్చింది.

## నేను ఇప్పటికీ ఇండస్ట్రీలో దాని కోసమే ప్రయత్నిస్తాను...



విలక్షణ నటనతో 'మక్కల్ సెల్వన్'గా గుర్తింపు తెచ్చుకున్న విజయ్ సేతుపతి కొత్త చిత్రం 'గాంధీ టాక్స్'తో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఇక ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా డబ్బు, వృత్తిపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. కిశోర్ బెలెకర్ దర్శకత్వంలో మూకీ చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమా నేడు విడుదలైన నేపథ్యంలో, ఆయన తన వ్యక్తిగత అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రతి ఒక్కరికీ డబ్బు చాలా ముఖ్యమని, అది ఆహారం లాంటి ప్రాథమిక అవసరమని ఆయన కుండబద్దలు కొట్టినట్లు తెలిపారు.? కోసమే కష్టపడుతున్నానని విజయ్ సేతుపతి పేర్కొన్నారు. "మనం కష్టపడి పనిచేసి మంచి ఫలితాన్ని ఇస్తేనే ప్రజలు మనకు తగిన పారితోషికం ఇస్తారు. లేదంటే ఇవ్వరు"

అని ఆయన నిజాయితీగా చెప్పారు. కేవలం సంపాదన కోసం మాత్రమే కాకుండా, పని పట్ల అంకితభావం ఉండాలని, అప్పుడే మనకు గుర్తింపుతో పాటు ఆర్థిక భద్రత లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, ఆనందాన్ని డబ్బుతో ముడిపెట్టడం సరికాదని ఈ సందర్భంగా విజయ్ సూచించారు. "పనులే మనకు అసలైన ఆనందాన్ని ఇస్తాయి, మనం పొరపాటుగా ఆ సంతోషాన్ని డబ్బుతో పోలుస్తున్నాం" అంటూ జీవిత సత్యాన్ని వివరించారు. అదితిరావు హైదరి, అరవింద్ సామి ప్రధాన పాత్రల్లో నటించిన 'గాంధీ టాక్స్' చిత్రంలో కేవలం హావభావాలతోనే మెప్పించిన విజయ్, తన మాటలతో కూడా ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్నారు.

## ఆసక్తికరంగా 'మా ఇంటి బంగారం'

గత కొంతకాలంగా విభిన్నమైన కథాంశాలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న స్టార్ హీరోయిన్ సమంత, మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో మన ముందుకు రాబోతున్నారు. నందిని రెడ్డి దర్శకత్వంలో ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం'. ఈ సినిమాకు సంబంధించిన టీజర్ ట్రైలర్ తాజాగా విడుదలై, సోషల్ మీడియాలో భారీ అంచనాలను పెంచుతోంది. 1980ల నాటి క్రైమ్ థ్రిల్లర్ఈ సినిమా ప్రధానంగా 1980ల నేపథ్యంలో సాగే ఒక ఉత్కంఠభరితమైన క్రైమ్ థ్రిల్లర్ అని ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. ఆ కాలం నాటి వాతావరణం, కాస్ట్యూమ్స్ మరియు సినిమాటోగ్రఫీ ప్రేక్షకులను ఆ పాత రోజుల్లోకి తీసుకెళ్లేలా ఉన్నాయి. సమంత సరికొత్త అవతారంట్రైలర్‌లో సమంత పాత్ర రెండు భిన్నమైన కోణాల్లో కనిపిస్తోంది. ఒక పక్క చాలా సాధారణమైన, అమాయకమైన గృహిణిలా కనిపిస్తూనే.. మరో పక్క శత్రువులను ఊచకోత కోసే పవర్ ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌లలో అదరగొట్టారు. "మా ఇంటి బంగారం మీ అందరితో కలిసిపోతుంది" అంటూ ఆమె చెప్పే డైలాగ్ సినిమాలో ఆమె పాత్రకున్న లోతును సూచిస్తోంది.




ఆకట్టుకుంటున్న తారాగణందర్శకురాలు నందిని రెడ్డి, సమంత కాంబినేషన్లో గతంలో వచ్చిన 'ఓ బేబీ' ఎంతటి విజయాన్ని అందుకుందో అందరికీ తెలిసిందే. వీరిద్దరి కలయికలో వస్తున్న మూడో సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. ఇందులో బాలీవుడ్ విలక్షణ నటుడు గుల్షన్ దేవయ్య కీలక పాత్రలో నటిస్తుండటం సినిమాకు మరో పెద్ద బలం.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215